మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 29-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 119 Issue: 119

29 అక్టోబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:17 సూర్యాస్తమయం - సా. 5:42 తిథిః సప్తమి ఉ. 9:21 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ సా. 5:17 వరకు తరువాత శ్రవణ యోగం ధృతి ఉ. 7:46 వరకు కరణం వనిజ ఉ. 9:21 వరకు విష్టి రా. 9:45 వరకు వర్జ్యం రా. 9:40 నుండి రా. 11:20 వరకు దుర్ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు రాహుకాలం ఉ. 11:59 నుండి మ. 1:25 వరకు యమగండం ఉ. 7:42 నుండి ఉ. 9:08 వరకు గుళికాకాలం ఉ. 10:34 నుండి ఉ. 11:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:41 నుండి తె. 5:29 వరకు అమృత ఘడియలు ఉ. 10:37 నుండి మ. 12:20 వరకు అభిజిత్ ముహూర్తం లేదుః గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



# మొంథా ముచ్చెమటలు

## అంతర్వేది వద్ద తీరాన్ని తాకిన తుఫాను

## ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు

## అల్లూరి జిల్లాలో అరకు ఘాట్ రోడ్డుపై ఉద్ధృతంగావరద

## సుంకరమెట్ట వద్ద రాకపోకలకు అంతరాయం

## ప్రకాశం జిల్లాలో వాగులో కొట్టుకుపోయిన కారు

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొంథా మంగళవారం రాత్రి కాకినాడ-మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకింది. వాతావరణశాఖ ప్రకారం, గడచిన ఆరుగంటల్లో తుపాను గంటకు 17 కిలోమీటర్ల వేగంతో తీరం వైపుకు కదిలి మంగళవారం రాత్రి 9 గంటల నుండి తీరాన్ని దాటే ప్రక్రియ ప్రారంభమైంది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయని అధికారులు తెలిపారు. తుపాను ప్రభావం వల్ల సముద్రం ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరప్రాంత గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది.

వైజాగ్, అక్టోబర్ 28 (ఈవార్తలు): మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోవడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాతావరణశాఖ వివరాల ప్రకారం, తుపాను పూర్తి స్థాయిలో తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. కాకినాడకు 110 కి.మీ, విశాఖకు 220 కి.మీ దూరంలో తుపాను కేంద్రం కేంద్రీకృతమై -2 వ పేజీలో...





హైదరాబాద్ నల్లకుంట శంకరమఠంలో శ్రీ శృంగేరి జగద్గురువు విధుశేఖర భారతీస్వామిని సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మ విజయ యాత్రలో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన విధుశేఖర భారతీ స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రేవంత్ రెడ్డి కలుసుకున్నారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను భారతీస్వామివారికి సీఎం వివరించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి విధుశేఖర భారతీ స్వామివారి సూచనలు స్వీకరించారు.

# బరాజ్‌ల బాధ్యత ఏజెన్సీలదే

## రిపేర్లకు ప్రణాళికలు సిద్ధం చేయండి

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు.. తుమ్మిడిహట్టిపై ఉత్తమ్‌తో కలిసి సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీరు, తాగు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకు పాత పనులను -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,082 |
| వెండి (గ్రాము): | రూ.165 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,472 |

## విశ్వవాణి



రెండేళ్ల పాటు నిరంతరం వ్యాయామం చేయడం ద్వారా గుండె వృద్ధాప్యాన్ని 20 ఏళ్లు వెనక్కి తగ్గించవచ్చని తాజా అధ్యయనంలో తేలింది. 24 నెలల పాటు వ్యాయామం చేసిన కొందరు యువకులపై చేసిన అధ్యయనంలో గుండె పనితీరు గతం కంటే మెరుగ్గా పనిచేసినట్లు వెల్లడైందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# 8వ పే కమిషన్‌కు ఆమోదం

## పచ్చజెండా ఊపిన కేంద్ర కేబినెట్



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రంలోని మోదీ సర్కారు శుభవార్త చెప్పింది. 8వ వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వేతన కమిషన్‌కు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి రంజనా ప్రకాశ్ దేశాయ్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

న్యూఢిల్లీ: కమిషన్‌లో చైర్‌పర్సన్‌తో పాటు సభ్యుడు (పార్ట్‌టైమ్), సభ్య కార్యదర్శి ఉంటారు. ప్రస్తుతం 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగియనున్నది. ఈ క్రమంలో కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో కేంద్ర మంత్రులతో పాటు మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపింది. అనంతరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 8వ వేతన సంఘం 18 నెలల్లోగా సిఫారసలు సమర్పిస్తుందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ తరువాయి 2 వ పేజీలో...



# టికెట్ల రేట్లు పెంచుతాం.. కానీ!

## కార్మికులకు 20% వాటా ఇస్తేనే

### సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): సినీ కార్మికుల శ్రమ తనకు తెలుసునని.. ఆస్కార్ స్థాయికి తెలుగు పరిశ్రమ వెళ్లింది అంటే కారణం కార్మికులేనని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం (అక్టోబర్ 28) హైదరాబాద్ యూసుఫ్ గూడలో ఏర్పాటు చేసిన సినీ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఇక నుంచి సినిమా టికెట్ ధర తరువాయి 2 వ పేజీలో...



# హరీశ్‌రావుకు పితృవియోగం

## రాజకీయ ప్రముఖుల సంతాపం

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం వేకువజామున కన్నుమూశారు. దీంతో హైదరాబాద్‌లోని క్రిన్స్‌విల్లాస్‌లో సందర్శనార్థం ఆయన పార్థివదేహాన్ని ఉంచారు.

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని క్రిన్స్‌విల్లాస్‌లో హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు భౌతిక కాయానికి బీఆర్ఎస్ అధినేత..మాజీ సీఎం కేసీఆర్ నివాళులర్పించారు. తన బావ సత్యనారాయణరావుతో (కేసీఆర్ 7వ సోదరి (అక్క) లక్ష్మి భర్త)తన అనుబంధాన్ని స్మరించుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం -2 వ పేజీలో...

# బండి ప్రకాశ్, చంద్రన్న లొంగుబాటు

## ప్రకాశ్ పేరిట రూ.20 లక్షల రివార్డు

## చంద్రన్న పేరిట రూ.25 లక్షల రివార్డు

## వారికే అందజేసిన డీజీపీ శివధర్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు) : మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. బండి ప్రకాశ్ పేరిట ఉన్న రూ. 20లక్షల రివార్డును, పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ. 25లక్షల రివార్డును వారికి అందించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా తరువాయి 2 వ పేజీలో...





# 9 నెలల్లో 49,000 కోట్లు

## హైవేలపై టోల్ వసూళ్ల జోరు.. ఆదాయం 16 శాతం వృద్ధి

## రాశి ఫలాలు

29.10.2025

మేషం: విద్యార్థులకు అనుకూల ఫలితాలు ఉంటాయి. సన్నిహితుల నుంచి అవసరానికి ధనసహాయం అందుతుంది. ఉద్యోగ, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారములో విజయం సాధిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

వృషభం: ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకం ఉ ంటుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపారాలు విస్తరిస్తారు.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కాదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. శుభకార్యాలకు ధన వ్యయం చేస్తారు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం ఉండదు. దూర ప్రయాణం సూచనలు ఉన్నవి. వ్యాపారమునకు సకాలంలో పెట్టుబడులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. కుటుంబ బాధ్యతలు మరింత పెరుగుతాయి.

సింహం: సంఘంలో విశేష గౌరవ మర్యాదలు పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తు వాహన లాభాలు అందుతాయి. వ్యాపార, ఉ ద్యోగాలలో సొంత నిర్ణయాలతో ముందుకు సాగుతారు. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది. వ్యాపార వ్యవహారాలలో అనుకూలత పెరుగుతుంది.

కన్య: వ్యాపార, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు. స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు లాభిస్తాయి. వృత్తి ఉ ద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు అందుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

తుల: ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు వలన మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి. ఇంటాబయట చికాకులు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

వృశ్చికం: ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఇంటాబయట బాధ్యతలు మరింతగా పెరుగుతాయి. వ్యాపార, ఉ ద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలతో తప్పవు.

ధనస్సు: భూ వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగ, వ్యాపారాలలో ఆశించిన పురోగతి కలుగుతుంది. విద్యార్థులకు శుభవార్తలు అందుతాయి. సంఘంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో వివాదాలు రాజీ చేసుకుంటారు.

మకరం: ఆరోగ్యం మందగిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పాత రుణాలు తీర్చడానికి నూతన రుణాలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఉంటాయి.

కుంభం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. వ్యాపారాలు విస్తరణకు తీసుకున్న నిర్ణయాలు కలసి వస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి.

మీనం: కొన్ని పనులలో శ్రమ తప్పదు. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలలో నష్ట సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. దాయదులతో ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి.

# 9 నెలల్లో 49,000 కోట్లు

## హైవేలపై టోల్ వసూళ్ల జోరు.. ఆదాయం 16 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ వసూళ్లు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. 2025 క్యాలెండర్ ఇయర్‌లో మొదటి తొమ్మిది నెలల్లో (జనవరి-సెప్టెంబర్) టోల్ ఆదాయం ఏకంగా 16 శాతం వృద్ధితో రూ.49,193 కోట్లకు చేరింది. వాహనాల రాకపోకలు గణనీయంగా పెరగడం, నిర్ణీత కాల వ్యవధిలో టోల్ రుసుములను సవరించడమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణాలని 'ఐసీఆర్ఏ అనలిటిక్స్' మంగళవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో టోల్ చెల్లించే వాహనాల సంఖ్య కూడా 12 శాతం పెరిగి 26,864 లక్షలకు చేరుకుంది. గతేడాది మొత్తం మీద ఎలక్ట్రానిక్ టోల్ వసూళ్లు రూ.57,940 కోట్లుగా నమోదయ్యాయి. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 11 శాతం అధికం. వాహనాల సంఖ్య పరంగా చూస్తే, 2023లో 30,383 లక్షలుగా ఉన్న టోల్ లావాదేవీలు, 2024 నాటికి 32,515 లక్షలకు పెరిగా యి. వాహనాల సంఖ్య కంటే టోల్ ఆదాయం వేగంగా పెరగడానికి భారీ వాహనాల వాటా ఎక్కువగా ఉండటం, టోల్ ఛార్జీల పెంపు వంటి అంశాలు దోహదపడినట్లు ఐసీఆర్ఏ విశ్లేషించింది. దేశ మొత్తం టోల్ ఆదాయంలో పశ్చిమ, దక్షిణ భారతదేశంలోని కారిడార్ల వాటా సగానికి పైగా ఉండటం స్థిరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది 9 నెలల కాలంలో మొత్తం వసూళ్లలో పశ్చిమ భారతదేశం సుమారు 30 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, దక్షిణాది 25 శాతంతో రెండో స్థానంలో, ఉత్తర భారతదేశం 23 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. తూర్పు, మధ్య భారతదేశం కలిపి నాలుగో వంతు వాటాను కలిగి ఉన్నాయి. పశ్చిమ, మధ్య, తూర్పు భారతదేశంలో టోల్ చెల్లించే వాహనాల్లో 50 శాతానికి పైగా వాణిజ్య వాహనాలే (సరుకు రవాణా) ఉంటున్నాయి. ముఖ్యంగా ఒడిశా, ఏపీలోని గనులు-ఓడరేవుల కారిడార్లు,



ఛత్తీస్‌గఢ్‌లోని ఖనిజ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల గుండా పారిశ్రామిక, లాజిస్టిక్స్ కార్యకలాపా లు చురుగ్గా సాగడమే ఇందుకు కారణమని ఐసీఆర్ఏ అనలిటిక్స్ నాలెడ్జ్ సర్వీసెస్ హెడ్ మధుబని సేన్‌గుప్తా వివరించారు. దీనికి భిన్నంగా, ఉత్తర, దక్షిణ భారతదేశంలో ప్రయాణికుల వాహనాలదే ఆధిపత్యం. ఇక్కడి టోల్ లావాదేవీలలో 65 నుంచి 70 శాతం కార్లు, జీపులే ఉంటున్నాయి. జనసాంద్రత ఎక్కువగా ఉన్న నగరాలు, శివారు ప్రాంతాలు, వ్యక్తిగత వాహనాల వినియోగం అధికంగా ఉండటం వల్ల ఈ ధోరణి కనిపిస్తోంది. మధ్య భారతదేశంలోని జాతీయ రహదారులు 44, 47, 52 వంటి కారిడార్లు సరుకు రవాణాతో పాటు ప్రయాణికుల రద్దీతో మిశ్రమ వినియోగ నెట్‌వర్క్‌గా మారుతున్నాయని నివేదిక పేర్కొంది.

## బరాజ్‌ల బాధ్యత ఏజెన్సీలదే

మొదటి పేజీ తరువాయి

ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లేందుకు అంచనాలను తయారు చేయాలన్నారు. సుందిళ్ల ప్రాజెక్టును రిపేరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, దీని ద్వారా శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలాగే, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కు సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై సమీక్షలో ఉన్నతాధికారులతో చర్చించారు. ఇటీవల ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి రాసిన లేఖలోని అంశాలను అధికారులకు వివరించారు. వీటిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి.. ప్రాజెక్టువారీగా అనాలసిస్ చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్ లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సీఎం అజ్ఞాపించారు. వీటితో పాటు సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల పరిస్థితిపైనా సీఎం సమీక్షలో చర్చించారు. బరాజ్‌ల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులవారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ సమావేశానికి సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## టికెట్ల రేట్లు పెంచుతాం.. కానీ!

మొదటి పేజీ తరువాయి

పెంచాలంటే కార్మికులకు 20 శాత ఇవ్వాలని అన్నారు. వాటా ఇస్తేనే టికెట్ల పెంపుకు జీవో ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం నంది అవార్డులను పట్టించుకోలేదని అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుమీదు.. గద్దర్ ఫిల్మ్ అవార్డ్‌ను ప్రకటించి చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. హాలీవుడ్‌ను హైదరాబాద్ కు తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా సీఎం అన్నారు. చిన్న సినిమాలను తక్కువచేసి చూసే ప్రసక్తే లేదని చెప్పారు. సినీ కార్మికులు అండగా ఉంటే హైదరాబాద్ కు హాలీవుడ్ తీసుకొస్తానని అన్నారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కృష్ణానగర్ ప్రాంతంలో సినీ కార్మికుల పిల్లలు చదువుకునేందుకు 3-4 ఎకరాల్లో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల నిర్మిస్తామని అన్నారు. కార్మికుల కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని.. ప్రభుత్వం తరపున రూ.10 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో సినీ పరిశ్రమకు ఒక చాప్టర్ కేటాయిస్తామని అన్నారు.

## 8వ పే కమిషన్‌కు ఆమోదం

మొదటి పేజీ తరువాయి

మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. కమిషన్ సిఫార్సులు రక్షణ సేవా సిబ్బంది సహా దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న జీతం, పింఛన్‌ను ఎంత వరకు పెంచాలో ఈ వేతన సంఘం కేంద్రానికి సిఫారసు చేరస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేస్తుంది.

### ఎరువుల సబ్సిడీకి ఆమోదం

రబీ సీజన్ (అక్టోబర్ 2025 %-% మార్చి 2026) కోసం ఫాస్ఫరస్, పొటాషియం (పి అండ్ కె) ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్ బిసి) రేట్లను నిర్ణయించడానికి ఎరువులశాఖ చేసిన ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందుకోసం రూ.37,952.29 కోట్లు కేటాయించింది. నైట్రోజన్‌పై కిలోకు రూ.43.02, ఫాస్ఫర్ట్ పై కిలోకు రూ. 47.96, పొటాష్ పై కిలోకు రూ. 2.38, సల్ఫర్ పై కిలోకు రూ 2.87 రాయితీ వర్తింపజేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. డై అల్యూమినియం ఫాస్ఫేట్ (డిఎపి), మోనో అల్యూమినియం ఫాస్ఫేట్ (ఎంఎపి), మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఒపి), ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ (టిఎస్ పి), 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్ పి), పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్ (పిడిఎం), అల్యూమినియం సల్ఫేట్ (ఎఎస్) వంటి దాదాపు 28 ఎన్‌పికెఎస్ కాంప్లెక్స్ ఫర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు పోషకాధిరత రాయితీ అమలు చేయాలని నిర్ణయించింది.

## బండి ప్రకాశ్, చంద్రన్న లొంగుబాటు

మొదటి పేజీ తరువాయి

మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా..పార్టీ సిద్ధాంతకర్తగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారు అని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మరో మావోయిస్టు నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో మావోయిస్టు పార్టీలో పనిచేశారని శివధర్ రెడ్డి తెలిపారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. సికాస కార్మిక సంఘం అధ్యక్షుడిగా, మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2004లో వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాది తెలంగాణలో 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. అందులో 8 మంది రాష్ట్ర కమిటీ, మరో ఇద్దరు కేంద్ర కమిటీ మెంబర్లు లొంగిపోయారు. ప్రస్తుతం పార్టీలో ఉన్నవారిలో 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్ట్రాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు తెలిపారు. 20 మంది డిస్ట్రిక్ కమిటీ, 14 మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు గుర్తించినట్లుగా వెల్లడించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టు నేతలపై ఎలాంటి చట్టపర చర్యలు ఉ ండవని, అసరమైతే.. వారికి రక్షణ కల్పిస్తాం అని డీజీపీ తెలిపారు.

## హరీశ్‌రావుకు పితృవియోగం

మొదటి పేజీ తరువాయి

తెలియజేశారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఒక ప్రకటనలో హరీశ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అటు.. సత్యనారాయణ రావు మృతికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. హరీశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా సంతాప ప్రకటన విడుదల చేశారు. 'సత్యనారాయణ చాలా మంచి వ్యక్తి. రాజకీయాలతో సంబంధం లేకుండా ఆయనతో ఎంతో కాలంగా నాకు సాన్నిహిత్యముంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. హరీశ్ రావు కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని అమ్మ వారిని వేడుకుంటున్నా' అని పేర్కొన్నారు.

# మొంథా ముచ్చెమటలు

మొదటి పేజీ తరువాయి

ఉందని తెలిపింది. తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. కుండపోత వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు ఘాట్ రోడ్డుపై వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండగా, ప్రకాశం జిల్లాలో ఓ కారు వాగులో కొట్టుకుపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతం తడిసి ముద్దయింది. వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో అరకు వ్యాలీ-విశాఖపట్నం మధ్య ఘాట్ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా సుంకరమెట్ట కాఫీ తోటలు, అనంతగిరి మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి కొందరు వాహనదారులు రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు అప్రమత్తమై, అనవసర ప్రయాణాలు మానుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేశారు. ప్రకాశం జిల్లాలోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఒంగోలు సమీపంలోని యరజర్ల-వెంగముక్కలపాలెం మధ్య ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఓ కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. అకస్మాత్తుగా పెరిగిన వరద తీవ్రతకు కారు అదుపుతప్పి వాగులోకి జారిపోయింది. అయితే, డ్రైవర్ అప్రమత్తమై వెంటనే కారులో నుంచి బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్



బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. రానున్న గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. తుఫాను ప్రభావంతో విశాఖ జిల్లాలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. పలు చోట్ల చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని పేర్కొన్నారు. తుపాను కారణంగా విశాఖకు వచ్చే 16 రైళ్లు రద్దయ్యాయి. ఇండిగో, ఎయిరిండియా విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. తుపాను సహాయక చర్యల కోసం తూర్పు నౌకాదళం సన్నద్ధమైంది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికార, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నిజాంపట్నం హార్బర్‌లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లద్దని అధికారులు హెచ్చరించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, గురజాల సహా పలు చోట్ల వానలు పడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి.

### 107 రైళ్ల రద్దు

మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏపీలోని కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. మంగళ, బుధవారాల్లో నడిచే 107 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. మంగళవారం 70, బుధవారం 36, గురువారం ఒక రైలును రద్దు చేసినట్లు వెల్లడించింది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్టణం, గుంటూరు, కాకినాడ, తెనాలి, రేపల్లె, మార్కాపురం, మచిలీపట్నం, నర్సాపురం, నిడదవోలు, ఒంగోలు, భీమవరం, మాచర్ల నుంచి బయల్దేరే పలు రైళ్లు రద్దయ్యాయి. ఆరు రైళ్లను దారి మళ్లించినట్లు.. 18 రైళ్ల సమయాల్లో మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలను రైల్వేశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. రైళ్ల రద్దు సమాచారాన్ని ప్రయాణికులకు పంపింది. ఆయా ప్రయాణికులకు టికెట్ మొత్తం తిరిగి చెల్లించనుంది. మరోవైపు విజయవాడ డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది.

### తెలంగాణను తాకిన 'మొంథా'

బంగాళాఖాతంలో ఏర్పడి.. ఆంధ్రప్రదేశ్‌ను కకావికలం చేస్తున్న 'మొంథా' తుఫాను ప్రభావం తెలంగాణను సైతం తాకింది. దీని కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ ందని పేర్కొంది. మొంథా తుఫాను తీవ్రత పెరగడంతో,.. ఆంధ్రప్రదేశ్ తీరం దాటిన తర్వాత దాని ప్రభావం తెలంగాణ తూర్పు, ఉత్తర జిల్లాలపై ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల తీవ్రత దృష్ట్యా.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు జిల్లాలతో పాటు.. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# సాక్షులను బెదిరిస్తే నేరుగా ఎఫ్ఐఆర్

## సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ: కేసుల్లో సాక్షులను బెదిరించడంపై సుప్రీంకోర్టు మంగళవారం ఒక చారిత్రక తీర్పు వెలువరించింది. తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ సాక్షులను బెదిరించడం (ఐపీసీ సెక్షన్ 195ఏ) కాగ్నిజబుల్ నేరమని స్పష్టం చేసింది. ఇలాంటి ఘటనలపై పోలీసులు కోర్టు నుంచి ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అవసరం లేకుండానే నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టవచ్చని తేల్చిచెప్పింది. జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. "ఐపీసీ సెక్షన్ 195ఏ కింద నమోదయ్యే నేరం కాగ్నిజబుల్ అయినప్పుడు, సీఆర్‌పీసీ సెక్షన్ 154, 156 కింద చర్యలు తీసుకునే పోలీసుల అధికారాన్ని శంకించలేం" అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఈ అంశంపై కేరళ ప్రభుత్వం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను విచారించిన అనంతరం ఈ తీర్పు ఇచ్చింది. గతంలో ఇలాంటి కేసుల్లో కోర్టు నుంచి ఫిర్యాదు తప్పనిసరి అని పేర్కొంటూ కేరళ, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఐపీసీ సెక్షన్ 195ఏ (2006లో చేర్చారు) అనేది సెక్షన్ 193 నుంచి 196 వరకు ఉన్న ఇతర నేరాల కంటే భిన్నమైనదని, ప్రత్యేకమైనదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. "ఒక సాక్షి కోర్టుకు రాకముందే, చాలా కాలం ముందే బెదిరింపులు ఎదుర్కోవచ్చు. బాధితుడైన సాక్షి లేదా ఇతరులు వెంటనే పోలీసులను ఆశ్రయించడానికి వీలుగానే ఈ నేరాన్ని కాగ్నిజబుల్‌గా వర్గీకరించారు" అని ధర్మాసనం వివరించింది. అంతేకాకుండా, సీఆర్‌పీసీలోని సెక్షన్ 195ఏ (2009లో చేర్చారు) బాధితులకు మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని ఒక అదనపు పరిహార మార్గంగా మాత్రమే కల్పిస్తోందని స్పష్టం చేసింది. అందులో వాడిన 'చేయవచ్చు' (%ఝఎ%) అనే పదం, బాధితులు కేవలం మేజిస్ట్రేట్‌ను మాత్రమే ఆశ్రయించాలనే నిబంధన తప్పనిసరి కాదని సూచిస్తోందని పేర్కొంది. ఈ తీర్పుతో, 2023 ఏప్రిల్ 4 నాటి కేరళ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. నిందితుడిని రెండు వారాల్లోగా ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, ఇతర కారణాలపై బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అతడికి అవకాశం ఉందని స్పష్టం చేసింది. అదేవిధంగా, యోగేష్ గౌడర్ హత్య కేసుకు సంబంధించి సీబీఐ ఫిర్యాదుపై ధార్వాడ్ మేజిస్ట్రేట్ 2020లో జారీ చేసిన ఆదేశాలను పునరుద్ధరించింది. ఈ కేసును కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ విషయంలో కేరళ, కర్ణాటక హైకోర్టుల వ్యాఖ్యానాలు "తప్పులతో కూడినవి, నిలకడలేనివి" అని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

## కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలం సేఫ్

### ప్రజావాణిలో ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో హైడ్రా పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించింది. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా, సరూర్ నగర్ మండలం, కర్మన్‌ఘాట్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కును కబ్జా చేశారంటూ స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. లే అవుట్‌లో పార్కు స్థలంగా చూపించి, ఆ తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారిణ జరిపి ఆక్రమణలను తొలగించారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురికాకుండా కాపాడినట్లు తెలియజేస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్, చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్ నగర్ పేరుతో 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లే అవుట్ వేసింది. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పేద ప్రజల కోసం ఉద్దేశించిన లే అవుట్‌లో కొందరు బడాబాబులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాటుగా మార్చారు. ఈ ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

## జనగామ రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ స్టాపేజీ

జనగామ, అక్టోబర్ 28 (ఈవార్తలు): దక్షిణ మధ్య రైల్వే ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లా కేంద్రంలో శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ సౌకర్యం కల్పించారు. విజయవాడ – సికింద్రాబాద్ – విజయవాడ మధ్య నిత్యం రాకపోకలు సాగించే ఈ




సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇకపై జనగామ రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 30వ తేదీ నుంచి శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు జనగామ రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా ఆగుతుందని ప్రకటించింది. విజయవాడ–సికింద్రాబాద్ రైలు ఉదయం 10:14 – 10:15 గంటల మధ్య ఒక నిమిషం పాటు, సికింద్రాబాద్ – విజయవాడ రైలు సాయంత్రం 5:19 – 5:20 గంటల మధ్య జనగామ రైల్వే స్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ. శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కవిత, రేవంత్ బిజినెస్ పార్ట్‌నర్లు

## రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే కవిత నడుస్తున్నారు.. జనం బాట యాత్ర తీహార్ జైలుకు వెళ్తుంది

### ఎంపీ ధర్మపురి అర్వింద్ కీలక వ్యాఖ్యలు



నిజామాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే కవిత నడుస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు. కవిత చేపట్టిన 'జనం బాట' యాత్రపై ఆయన తీవ్రంగా స్పందించారు. "అసలు కవిత ఎవరు? జాగృతి ఏంటి?" అని ప్రశ్నించారు. కవిత 'జనం బాట' యాత్ర తీహార్ జైలుకు దారితీస్తుందని, మూడు నాలుగేళ్లలో ఆమె ఆశయం నెరవేరుతుందని ఎద్దేవా చేశారు. గతంలో కాంట్రాక్టర్లు ఆమె వేధింపులకు భయపడి పారిపోయారని ఆరోపించారు. అణగారిన వర్గాల విద్యార్థులు ఎదగకూడదనే కుటిల ఆలోచనతోనే కల్వకుంట్ల కుటుంబం బీసీ, ఎస్సీ, ఎస్టీల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఆపిందని విమర్శించారు. ఒక తరాన్ని మొత్తం అణగదొక్కిన చరిత్ర వారిదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ పదవికి కవిత చేసిన రాజీనామాను వెంటనే ఆమోదించాలని బీజేపీ తరఫున మండలి ఛైర్మన్‌కు లేఖ రాస్తున్నట్లు అరవింద్ తెలిపారు. "రేవంత్ రెడ్డికి, కవితకు మధ్య ములాఖత్ ఏంటి? ఆమె రాజీనామాను ఎందుకు ఆమోదించడం లేదు?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కవితతో రేవంత్ రెడ్డి కొత్త పార్టీ పెట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారిద్దరూ బిజినెస్ పార్ట్‌నర్లు అని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు.

# జూబ్లీహిల్స్ ఖరీదైన ప్రాంతమైనా..!

### ప్రజల బాధలు వర్ణనాతీతం: ఈటల రాజేందర్



జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అంటే హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతమే అయినప్పటికీ, ఇదే నియోజకవర్గంలోని బస్తీల్లో ప్రజల బాధలు వర్ణనాతీతమని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేరుకే ఇది జూబ్లీహిల్స్ అని, కానీ ఇక్కడ కూడా మురికి కాలువలు, దుర్వాసన, గతుకుల రోడ్లు కనిపిస్తాయని అన్నారు. ఏ పేదవాడిని కదిలించినా తమను పట్టించుకునే వారే లేరని బాధపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ల విషయంలో నిన్న బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అదే గతి పడుతుందని అన్నారు. 40 ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ ఎలా ఉందో.. ఇప్పుడు కూడా అలాగే ఉందని ఎద్దేవా చేశారు. మంత్రుల మధ్య ఏమాత్రం సమన్వయం లేదని ఈటల రాజేందర్ అన్నారు. మంత్రులకు డబ్బులు సంపాదించుకోవడానికి, దోచుకోవడానికే సమయం సరిపోతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా బీజేపీ మాత్రమే కొట్లాడుతోందని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను బొంద పెడితేనే చలనం వస్తుందని అన్నారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే నరేంద్ర మోదీయే ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మోదీ లేకపోతే దేశం అధోగతి పాలవుతుందనే భావన ప్రజల్లో ఉందని అన్నారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ చాపకింద నీరులా విస్తరిస్తోందని ఆయన అన్నారు.

# 'ఏరో-ఇంజిన్' రాజధానిగా తెలంగాణ


### మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): తెలంగాణను 2030 నాటికి దేశ 'ఏరో-ఇంజిన్ రాజధాని'గా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్ న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ఫెసిలిటీ ద్వారా ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్), లో ప్రెషర్ టర్బైన్ షాఫ్ట్ (రోటేటివ్ కాంపోనెంట్)లు తయారు కానున్నాయి. ఈ కొత్త యూనిట్ ద్వారా తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తమవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. గ్లోబల్ ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం 'సిటీ ఆఫ్ పెరల్స్' మాత్రమే కాదని 'ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్' నగరంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023–24లో రూ.15,900 కోట్లు ఉండగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరిగాయని మంత్రి చెప్పారు. విమాన తయారీ కంపెనీలకు రాష్ట్రం గమ్యస్థానంగా ఉందని, ఇక్కడ తామ కార్యకలాపాలు చేపట్టాలని అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు మంత్రి పిలుపునిచ్చారు. ఇంజిన్స్, కాంపోనెంట్స్, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# సొంత జిల్లాకు సీఎం అన్యాయం

### జాగృతి అధ్యక్షురాలు కవిత



జడ్చర్ల, అక్టోబర్ 28: సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను సందర్శించి కవిత మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చారిత్రక అన్యాయం చేస్తున్నారని.. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని క్షమించరని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లను సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా.. రివ్యూ పిటిషన్ వేయకపోవటం దారుణమని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ ప్రాజెక్ట్‌ల పర్మిషన్ ఆపేసి లిస్ట్ లోంచి తీసేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చినట్లు తెలిపారు కవిత. మహబూబ్ నగర్ జిల్లాకు నీరిచ్చే వరప్రదాయని కృష్ణానది అని కొనియాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత అలాంటి కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేసుకోవటం జరిగిందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా సరే ప్రాజెక్ట్ ఒక్క అడుగూ ముందుకుపడలేదని విమర్శించారు. ఉదండాపూర్, కరివెనలో ఒక తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లపూర్- ఏదుల టన్నెల్ పనులను చేయటం లేదన్నారు. ఒక పక్క ఉన్న నీళ్లను వాడుకోవటం లేదని.. మరో పక్క ఆల్మట్టి ఎత్తు పెంచితే మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. తక్షణమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## దండుపాళ్యం బ్యాచ్ అంటే దంచికొడతాం: సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పక్కా లోకల్ వ్యక్తి అని.. ఆయన గెలుపును ఎవరూ ఆపలేరని మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు. బైపోల్ ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలోని బోరబండ డివిజన్ లో నవీన్ యాదవ్ కు మద్దతుగా సీతక్క విస్తృతంగా పర్యటించారు. నవీన్ యాదవ్(%చీఙుజవవఅ్ఘఙుజ%)ను పదే పదే రౌడీ షీటర్ అని బీఆర్ఎస్ వాళ్లు అనడం కరెక్ట్ కాదని అన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో తామేం చేశామో ప్రజలకు అంతా తెలుసని అన్నారు. మరోసారి తమ కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అంటే ఊరుకునే ప్రసక్తే లేదని.. దంచికొడతామని సీతక్క స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో అధికార కాంగ్రెస్ పార్టీ స్పీడ్ పెంచింది. అన్ని డివిజన్ లలో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రతి డివిజన్‌లలో ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా ఇప్పటికే మంత్రులు ప్రచారం నిర్వహిస్తుండగా.. తాజాగా మంత్రులకు డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం మొదలుపెట్టారు.

## వచ్చే ఏడాది నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు: భట్టి

ఖమ్మం, అక్టోబర్ 28 (ఈవార్తలు): రాష్ట్ర విద్యా వ్యవస్థను గేమ్ చేంజర్‌గా మార్చే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో విద్యా రంగంపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలవాలన్న దృష్టితో సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఆ దిశగా ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామీణ యువత పోటీ పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లి ఖర్చులు పెట్టాల్సిన అవసరం లేకుండా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ లైబ్రరీ, నిష్ణాతులైన అధ్యాపకులచే ఆన్‌లైన్ కోచింగ్, పోటీ పరీక్షలకు అవసరమైన మొత్తం స్టడీ మెటీరియల్ ఈ సెంటర్లలో అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో ఐదు ప్రదేశాల్లో ఇవి ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అందించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని భట్టి ప్రకటించారు. మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా, పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, బోధనా సౌకర్యాలు పెంచుతున్నామని స్పష్టం చేశారు. ప్రతి పది గ్రామాలకు ఒక పాఠశాలను గుర్తించి అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్థానిక సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించే విధంగా సూచనలు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల పైన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి విద్యుత్‌లో స్వయం సమృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## కురిక్యాల స్కూల్ హెచ్‌ఎం సస్పెండ్

### మిగతా సిబ్బంది మొత్తం ట్రాన్స్‌ఫర్

గంగాధర, అక్టోబర్ 28 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురక్యాల ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల బాతురూంలో సీక్రెట్ కెమెరా పెట్టి విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యాకూబ్ పాషాపై ఫిర్యాదు చేసినప్పటికీ ప్రధానోపాధ్యాయుడు చర్యలు తీసుకోకపోవడంపై నిరసనలు వెల్లువెత్తడంతో అధికారులు స్పందించారు. బీజేపీ ఆధ్వర్యంలో జగిత్యాల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంతటి ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయడంపై మండిపడ్డారు. పైగా విషయాన్ని బయటకు చెబితే పాఠశాలలోనే ఆత్మహత్య చేసుకుంటానని అటెండర్ యాకూబ్ భాషా బెదిరించడంతో పాఠశాల సిబ్బంది వెనక్కి తగ్గినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. సఖీ కౌన్సిలింగ్ నిర్వాహకుల ద్వారా యాకూబ్ భాషా దారుణాలను కలెక్టర్ తెలుసుకున్నారు. మరో వైపు బాధిత విద్యార్థుల వివరాలు బయటకు తెలియకుండా జాగ్రత్తలు పాటించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అధికారులకు సూచించారు.

## నలుగురికి ఐపీఎస్ హోదా

హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): తెలంగాణ పోలీసు శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన నలుగురు నాన్–కేడర్ సీనియర్ పోలీసు అధికారులకు కన్ఫర్డ్ ఐపీఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చందన్ కుమార్ అధికారికంగా ఆదేశాలు విడుదల చేశారు. పదోన్నతి పొందిన అధికారుల జాబితాలో సీహెచ్. సమయ్ జాన్‌రావు, ఎస్. శ్రీనివాస్, కె. గుణశేఖర్, డి. సునీత ఉన్నారు. వీరంతా ప్రస్తుతం వివిధ విభాగాల్లో ఎస్పీ హోదాలో సేవలు అందిస్తున్నారు. తాజా ఉత్తర్వులతో వీరికి ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) కేడర్‌కు ప్రమోషన్ లభించినట్లయింది. ఈ నెల 24న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో సెలెక్ట్ కమిటీ సమావేశం జరిగింది. 1955లోని రెగ్యులేషన్ 7, సబ్–రెగ్యులేషన్ (3) నిబంధనల ప్రకారం ఈ కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగానే కేంద్ర హోంశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పదోన్నతులతో రాష్ట్ర పోలీసు శాఖలో అధికారుల బాధ్యతలు మరింత పెరగనున్నాయి. సీనియర్ అధికారులకు ఐపీఎస్ హోదా లభించడంపై శాఖలో హర్షం వ్యక్తమవుతోంది.

## ఏపీకి వెళ్లాల్సిన 18 విమానాలు రద్దు

శంషాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిన 18 విమానాలు రద్దు అయ్యాయి. శంషాబాద్ నుంచి విజయవాడ, విశాఖ, రాజమండ్రికి వెళ్లాల్సిన విమానాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. విజయవాడ, విశాఖ, రాజమండ్రి నుంచి శంషాబాద్‌కు రావాల్సిన విమానాలు కూడా రద్దు అయ్యాయి. మొంథా తుపాను కారణంగా విమాన సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో విమానాలను రద్దు చేశారు. ఈ క్రమంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొంథా తుపాను కారణంగా ఏపీలోని పలు జిల్లాల్లో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. అక్కడక్కడ భారీ వృక్షాలు నేలకూలాయి. పలు రోడ్లు ధ్వంసం అయ్యాయి.

## జూబ్లీహిల్స్ బై పోల్‌కు 127 పోలింగ్ స్టేషన్లు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 28 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 127 పోలింగ్ కేంద్రాల్లో 407 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌కి నాలుగు చొప్పున 1,628 బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. అదనంగా 20 శాతం బ్యాలెట్ యూనిట్లను సిద్ధంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికలో భాగంగా 509 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్లు సిద్ధం చేశారు. ఇప్పటికే ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తై పోయిందన్నారు. ఇక జూబ్లీహిల్స్ బై పోల్ నేపథ్యంలో నియోజకవర్గానికి కేంద్ర బలగాలు రానున్నాయి. ఏడు కంపెనీల కేంద్ర బలగాలతో పాటు 1600 మంది లోకల్ పోలీసులతో భారీ బందోబస్తు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులు చేసిన ఖర్చుల రిజిస్టర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులకు చూపించాలని ఆదేశించారు.





# కాకినాడ జిల్లాలో 31 వరకు సెలవులు

కాకినాడ, అక్టోబర్ 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ను మొంథా తుపాన్ వణికిస్తోంది. పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో ఉన్న మొంథా తుపాన్ గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర-వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం కాకినాడకు 360 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. కాకినాడ దగ్గర ఇవాళ సాయంత్రం లేదా రాత్రి సమయంలో తీవ్ర తుపాన్ గా మారి తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. తుపాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో స్కూళ్లు, కాలేజీలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. ఈ నెల 31 వరకు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను మూసేయాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ రోజు, రేపు విద్యాసంస్థలకు అధికారులు సెలవులు ప్రకటించారు. వర్షాల పరిస్థితిని గమనించి సెలవులు పొడిగించాలా లేదా అని నిర్ణయం తీసుకుంటారు.

**ఉగ్రరూపం దాల్చిన సముద్రం**

మొంథా తుపాను ప్రభావంతో నెల్లూరు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేయడంతో అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమై సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ కావడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 38 మండలాల్లో మొత్తం 142 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 3.7 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలంలో అత్యధికంగా 16.6 మి.మీ. వర్షం కురవగా, ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరంలో అత్యల్పంగా 1 మి.మీ. మాత్రమే నమోదైంది. జిల్లాలోని 10 మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎండగా ఉన్న వాతావరణం, ఆ తర్వాత ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. మైపాడు, కృష్ణపట్నం, రామాయపట్నం తీర ప్రాంతాల్లో సముద్రం ఉగ్రరూపం దాల్చింది. బలమైన ఈదురుగాలులతో అలలు ఎగిసిపడుతున్నాయి. ఎగువన ఉన్న కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో సోమశిల జలాశయం తన పూర్తిస్థాయి నీటిమట్టమైన 78 టీఎంసీలకు చేరువవుతోంది. దీంతో సోమశిల డ్యామ్ పరిసర గ్రామాలు ముంపునకు గురికాకుండా అధికారులు ముందుజాగ్రత్తగా వరద నీటిని పెన్నా నదిలోకి విడుదల చేస్తున్నారు. తుపాను పరిస్థితులపై జిల్లా ప్రత్యేక అధికారి యువరాజ్, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సమీక్ష నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే బలవంతంగానైనా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన స్పష్టం చేశారు. తుపానును ఎదుర్కొనేందుకు అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని కలెక్టర్ శుక్లా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 144 పునరావాస కేంద్రాలు ఆదివారం రాత్రి నుంచే పనిచేస్తున్నాయని ఆయన వివరించారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలగకుండా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఒక సెల్ టవర్‌ను కూడా ఏర్పాటు చేశారు.



## భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు

**బీజేపీ సిరిసిల్ల మాజీ అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ**



వేములవాడ, అక్టోబర్ 28 (ఈవార్తలు): రాజన్న క్షేత్రం వేములవాడలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న రీనోవేషన్ పనులు భక్తుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'గత నాలుగు, ఐదు నెలలుగా దేవాలయం పనులు ఎప్పుడు మొదలవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే అంశంలో స్పష్టత లేకుండా జరుగుతున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. అధికార పార్టీ మాత్రం తాము అభివృద్ధికి అడ్డుగా మారుతున్నామనే తప్పుడు ప్రచారం చేస్తోంది. కానీ మేము ఎట్టి పరిస్థితుల్లోనూ అభివృద్ధికి వ్యతిరేకం కాద'ని స్పష్టం చేశారు. గత పది, పదిహేను రోజులుగా పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్న ఆయన, "మేము వాటికి వ్యతిరేకం కాదు. అయితే కనీసం భక్తులకు రెండు నుంచి మూడు గంటలైనా దర్శనం కల్పించాలని మే 14న బంద్ సమయంలో అఖిలపక్ష కమిటీ తరపున ఇదే డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కోటిలింగాలను తొలగించే ఆలోచన భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని అదే సమయంలో ఆలయంలో ఉన్న దర్గాను అలాగే ఉంచి, కోటిలింగాలను మాత్రమే తొలగిస్తే మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం రెండు అంశాలపై సమాన నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే కోట్లాది హిందువుల ఆత్మగౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. దేవాదాయ శాఖ సెక్యులర్ శాఖనా? లేక మతపరమైన శాఖలా?" అని ప్రశ్నించిన ప్రతాపరామకృష్ణ, "పవర్ ప్రెజెంటేషన్ రోజున కూడా అధికారులు దర్గా అంశంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇది భక్తుల్లో అనుమానాలు కలిగిస్తుందని విమర్శించారు. వేములవాడలో హిందూ, ముస్లిం వర్గాలు శతాబ్దాలుగా సామరస్యంగా జీవిస్తున్నప్పటికీ, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆ సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ అంశంపై స్పందించాలని కోరారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, రెండు వర్గాల మధ్య సమతౌల్యం ఉండేలా ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. దేవాదాయ శాఖ ఒక వారం రోజుల్లో దర్గా అంశంపై స్పష్టత ఇవ్వాలి. లేకపోతే బీజేపీ భవిష్యత్ కార్యాచరణలో రాజీ ఉండదన్నారు. ఇది కేవలం బీజేపీ సమస్య కాదు, హిందూ సమాజ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. అవసరమైతే మళ్లీ వేములవాడ బంద్ పిలుపునిస్తామని ప్రతాపరామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, సంటి మహేష్, వివేక్ రెడ్డి, సాయి బిల్లాకృష్ణ, మహంకాళి శ్రీనివాస్, రేగుల రాజ్ కుమార్, రేనీకింది అశోక్, కటకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి ఘోర ప్రమాదం

**కారు-టాటా ఏస్ ఢీ.. 15 మంది తీవ్ర గాయాలు**

చందుర్తి/రుద్రంగి, అక్టోబర్ 28 (ఈవార్తలు): చందుర్తి మండలంలోని మాల్యాల కట్టలింగంపేట మధ్య జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి 1:10 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్వర్ణగిరి నుంచి తిరుగు ప్రయాణంలో రుద్రంగికి చెందిన వారి టాటా ఏస్ వాహనం, కారు రెండు ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. రుద్రంగి గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు యాత్ర ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రిపూట మబ్బులు కమ్మిన వాతావరణంలో మాల్యాల, కట్టలింగంపేట మధ్య టాటా ఏస్, కారు రెండు వాహనాలు ఢీ కొట్టుకున్నాయి. ఈ ఢీకొన్న ప్రభావంతో వాహనంలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో సహా 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. డ్రైవర్ రాజు (30, కాలు విరిగింది) కాలు విరగడంతో తీవ్ర గాయాలయ్యాయి. లచ్చినర్సవ్వ (58) ఢీకొన్న ధాటికి ముఖం పగిలి తీవ్ర రక్తస్రావమైంది. లక్ష్మి (40), బి. ప్రవీణ్ (27), ఎం. దేవాలక్ష్మి (45), బి. రత్నమ్మ (40), ఇంకా మరో 10 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులందరూ రుద్రంగి గ్రామ నివాసితులుగా గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరిగినా, సమాచారం అందిన వెంటనే చందుర్తి, రుద్రంగి ప్రాంతాల నుంచి అంబులెన్సులు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి.

## 17 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

**పేకాట స్థావరాలపై సీసీఎస్ పోలీసుల దాడి**

**రూ.29370 నగదు, 12 మొబైల్స్ స్వాధీనం**


కోరుట్ల, అక్టోబర్ 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అష్టలక్ష్మి ఆలయ సమీపంలో పేకాట ఆడుతున్న 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 22,050 నగదు, 5 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వకోట గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద రూ.7320 నగదు, 7 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

## పోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ: ఎమ్మార్పీఎస్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 28 (ఈవార్తలు) : ఉద్యమ పోరాటాల వల్లే ఎస్సీ వర్గీకరణ సాధించామని కోర్టు కు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన న్యాయస్థాన కోర్టు కు ఎమ్మార్పీఎస్ నేతలు మంగళవారం హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ప్రధానమంత్రి తెలంగాణ పర్యటన సందర్భంగా జాతీయ రహదారి దిగ్బంధం చేయడంలో భాగంగా 2022 ఆగస్టు 3 న కరీంనగర్ ప్రధాన రహదారి మల్యాల ఎక్స్ రోడ్ వద్ద దిబ్బంధం చేశారు. మల్యాల పోలీసులు పోలీస్ స్టేషన్ కు తరలించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. ఏ.2గా నక్క సతీష్, ఏ3 గా సురుగు శ్రీనివాస్, ఏ4 గా బొల్లె అనిల్ పై కేసు నమోదయ్యాయి. ఎమ్మార్పీఎస్ నాయకుల తరుపున న్యాయవాది బిరుదుల లక్ష్మణ్ తో జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘకాలం పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని, న్యాయబద్ధమైన మా పోరాటాన్ని వంచి వేయడానికి మాపై కేసులు పెట్టి ఉద్యమాన్ని ఆపే విధంగా ప్రయత్నించారని తెలిపారు. వెంటనే ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## పాట్నాను చిత్తు చేసిన తెలుగు టైటాన్స్

ప్రో కబడ్డీ లీగ్-2025లో తెలుగు టైటాన్స్ తమ జోరును కొనసాగిస్తోంది. మంగళవారం ఢిల్లీ వేదికగా పాట్నా పైరేట్స్‌తో జరిగిన ఎలిమినేటర్-3 మ్యాచ్‌లో 46-39 తేడాతో టైటాన్స్ విజయం సాధించింది. దీంతో క్వాలిఫయర్-2కు తెలుగు టైటాన్స్ అర్హత సాధించింది. టైటాన్స్ ఆల్‌రౌండర్ భరత్ హుడా మరోసారి తన అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ కీలక మ్యాచ్‌లో భరత్ ఏకంగా 23 పాయింట్లు సాధించాడు. అందులో 17 టచ్ పాయింట్లు, 6 బోనస్ పాయింట్లు ఉన్నాయి. కెప్టెన్ విజయ్ మాలిక్ మాత్రం కేవలం 5 పాయింట్లు తీసుకొచ్చాడు. పాట్నా రైడర్స్‌లో అయాన్ మినహా మిగితా అందవరూ విఫలమయ్యారు. బుధవారం జరగనున్న క్వాలిఫయర్-2లో పుణేరి పల్టన్‌తో టైటాన్స్ తలపడనుంది.




## జిల్లాలను సరిదిద్దాలి

**గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన**

**మంత్రివర్గ ఉపసంఘం భేటీలో చంద్రబాబు**

**ఇప్పటికే ప్రజాసంఘాల నుంచి వినతుల స్వీకరణ**

**సరిహద్దుల మార్పుపై త్వరలో నిర్ణయం**

అమరావతి, అక్టోబర్ 28 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా ఉందని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, దానిని సరిదిద్దే చర్యలకు ఉపక్రమించారు. ఈ అంశంపై మంగళవారం ఆయన మంత్రివర్గ ఉప సంఘంతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు, జిల్లాల పునర్విభజనపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు హాజరయ్యారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన అశాస్త్రీయ పద్ధతిలో జరిగిందని, దానివల్ల పరిపాలనాపరమైన ఇబ్బందులతో పాటు ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ విభజనను తక్షణమే సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశంపై మంత్రివర్గ ఉప సంఘం పలుమార్లు సమావేశమైంది. జిల్లాల సరిహద్దుల మార్పులకు సంబంధించి వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి వచ్చిన వినతులను, అభ్యంతరాలను స్వీకరించి నివేదిక సిద్ధం చేస్తోంది. ఈ సమావేశంలో ఉప సంఘం ఇప్పటివరకు జరిపిన కసరత్తును ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ, శాస్త్రీయంగా, పరిపాలనకు సౌలభ్యంగా ఉండేలా కొత్త సరిహద్దులను నిర్ణయించాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. ఉప సంఘం నివేదిక ఆధారంగా ప్రభుత్వం త్వరలోనే జిల్లాల పునర్విభజనపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే..!

**19 వాహనాలకు కనిపించిన బైక్**

**ఆ ఒక్క డ్రైవర్‌కే కనిపించలేదా?**

**డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల అనుమానం**

**విచారణలో పొంతనలేని సమాధానాలు**

**ఫోరెన్సిక్, ఆర్టీఏ నివేదికల కోసం వెయిటింగ్**



కర్నూలు, అక్టోబర్ 28 (ఈవార్తలు): కర్నూలు సమీపంలో 19 మందిని బలిగొన్న బస్సు ప్రమాద ఘటనలో విచారణ వేగవంతమైంది. డ్రైవర్ లక్ష్మయ్య నిర్లక్ష్యం వల్లే ఈ ఘోర దుర్ఘటన జరిగిందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి ముందు కేవలం 10-15 నిమిషాల వ్యవధిలో అదే మార్గంలో ప్రయాణించిన 19 భారీ వాహనాలు రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను గుర్తించి, దానిని తప్పించుకుని వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, అంతమందికి కనిపించిన బైక్ కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌కు ఎందుకు కనిపించలేదనే ప్రశ్న తలెత్తుతోంది. గత శుక్రవారం తెల్లవారుజామున 2:45 గంటలకు శివశంకర్, ఎర్రిస్వామి అనే ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వెళ్తూ చిన్నటేకూరు వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైకర్ శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఎర్రిస్వామి గాయపడ్డాడు. వారి బైక్ రోడ్డు మధ్యలోనే పడిపోయింది. సరిగ్గా 10-15 నిమిషాల తర్వాత, అంటే 2:55 నుంచి 3 గంటల మధ్య, బెంగళూరు వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు రోడ్డుపై ఉన్న బైక్‌ను గుర్తించకుండా పైనుంచి దూసుకెళ్లింది. దీంతో బైక్ బస్సు కింద ఇరుక్కుని, ఘర్షణకు గురై మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదంలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ లక్ష్మయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులకు అతను పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. మొదట బైకర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టాడని, ఆ తర్వాత ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టానని రకరకాలుగా చెప్పాడు. అయితే, ప్రమాదానికి ముందు యువకులు పెట్రోల్ బంకులో ఉన్న సీసీటీవీ ఫుటేజీ బయటకు రావడంతో అసలు విషయం అంగీకరించాడు. వర్షం, చీకటి కారణంగా నల్లరంగు బైక్‌ను గుర్తించలేకపోయానని, దగ్గరకు వచ్చాక సడెన్ బ్రేక్ వేస్తే వెనుక వాహనాలు ఢీకొడతాయనే భయంతో బైక్ పైనుంచే బస్సును పోనిచ్చానని చెప్పినట్లు సమాచారం. లక్ష్మయ్య వాదనను పోలీసులు విశ్వసించడం లేదు. ప్రమాద సమయంలో ఆ మార్గంలో వెళ్లిన నలుగురు లారీ, బస్సు డ్రైవర్లను విచారించగా, వారు కీలక సమాచారం ఇచ్చారు. "రోడ్డుకు అడ్డంగా ఓ బైక్ పడి ఉంది. స్పృహలో లేని యువకుడిని మరో వ్యక్తి పక్కకు లాగడం మేము గమనించాం. వెంటనే బైక్‌ను తప్పించుకుని ముందుకు వెళ్లాం" అని వారు పోలీసులకు వివరించారు. అంతమంది డ్రైవర్లకు కనిపించిన బైక్, లక్ష్మయ్యకు కనిపించలేదని చెప్పడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి రోడ్డు రవాణా, అగ్నిమాపక, ఫోరెన్సిక్ విభాగాల నుంచి నివేదికలు అందాల్సి ఉంది. అవి రాగానే దర్యాప్తు ఓ కొలిక్కి వస్తుందని అధికారులు తెలిపారు.

## ఎంపీహెచ్ఎస్ ఉద్యోగులకు ఊరట

**హైకోర్టు తీర్పును కొట్టివేసిన 'సుప్రీం'**

న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. సుప్రీంలో 1200 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు (%ఎజూస్త్రం%) ఊరట దక్కింది. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల కొనసాగింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2013లో ఉమ్మడి ఏపీలో కారుణ్య నియామకాల కింద 1200మంది ఎంపీహెచ్ఎస్‌లు ఉద్యోగం పొందారు. అయితే, ఆ నియామక ప్రక్రియను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా ఆ 1200మందిని కారుణ్య నియామకం కింద నియమించామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు 1200మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్ని రద్దు చేసింది. దీనిపై ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా విచారణ చేపట్టిన దేశ అత్యున్నత న్యాయ స్థానం .. తెలంగాణ హైకోర్టు తీర్పును కొట్టివేసింది. మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు వారి ఉద్యోగాల్లో కొనసాగించవచ్చని కీలక తీర్పును వెలువరించింది.

## 30 మంది విద్యార్థులకు కరెంట్ షాక్?

విజయనగరం, అక్టోబర్ 28 (ఈవార్తలు): ఏపీలో మొంథా తుపాను బీభత్సం సృష్టిస్తోంది. మొంథా తీవ్రతతో భారీ వర్షాలు, వరదలు, కుండపోత వర్షం రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తుండటంతో విద్యుత్ స్తంభాలు నేలమట్టమవుతున్నాయి. చెట్లు కూలిపోతున్నాయి. సెల్ టవర్స్ దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా గుర్ల మండలంలోని కస్తూర్బా హాస్టల్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ స్తంభం పాఠశాల గోడపై పడింది. విద్యార్థులు గోడను పట్టుకోవడంతో విద్యుత్ ప్రసారం కావడంతో 30 మంది విద్యార్థులకు కరెంట్ షాక్ తగిలినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన అధికారులు విద్యార్థులను అత్యవసర చికిత్స కోసం నెల్లిమర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## గాజాలో మళ్లీ తీవ్ర ఉద్రిక్తతలు



గాజా: భద్రతా సంప్రదింపుల తర్వాత, గాజా స్ట్రిప్‌లో శక్తివంతమైన దాడులు వెంటనే నిర్వహించాలని ప్రధాన మంత్రి నెతన్యాహు సైనిక శ్రేణిని ఆదేశించారు. ఐడీఎఫ్ పరిస్థితుల అంచనా తర్వాత, మంగళవారం సాయంత్రం 6:00 గంటలకు గాజా స్ట్రిప్ సమీపంలోని కమ్యూనిటీలలో భద్రతా పరిమితులను ఐడీఎఫ్ ఎత్తివేస్తుంది. పరిస్థితుల అంచనా, రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఆమోదం తర్వాత, ఈరోజు నుండి గాజా స్ట్రిప్ సమీపంలోని కమ్యూనిటీలలో ఐడీఎఫ్ పరిమితులను ఎత్తివేయాలని నిర్ణయించారు. ఈ ప్రకటనలు గాజా పరిణామాలపై ఇజ్రాయెల్ ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయి. భద్రతా పరిమితుల ఎత్తివేత ఒకవైపు ప్రజలకు ఉపశమనం కలిగించవచ్చు, కానీ శక్తివంతమైన దాడుల ఆదేశం మరోవైపు మానవీయ సంక్షోభాన్ని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

# గోల్డ్ బాండ్ యూనిట్‌కు 12,198

## 2020-21 యూనిట్‌కు అధిక రాబడి.. ఐదేళ్లలోనే ఇన్వెస్టర్లకు 166 శాతం లాభాలు

న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. ఎస్‌జీబీ 2020-21 సిరీస్-వన్ బాండ్ల ముందస్తు విమోచన (ప్రీమెచ్యూర్ రిడెంప్షన్) ధరను ప్రకటించింది. ఒక్కో యూనిట్‌కు రూ. 12,198గా ధరను ఖరారు చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ బాండ్లను రీడీమ్ (నగదు రూపంలోకి మార్చుకోవడం) చేసుకునేందుకు ఇన్వెస్టర్లకు మంగళవారం (అక్టోబర్ 28) నుంచి అవకాశం కల్పించారు. ఈ సిరీస్ బాండ్లను జారీ చేసినప్పుడు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి గ్రాముకు రూ. 4,589కే లభించాయి. ఆఫ్‌లైన్‌లో కొన్నవారు గ్రాముకు రూ. 4,639 చెల్లించారు. ఇప్పుడు ఆర్బీఐ ప్రకటించిన విమోచన ధరతో పోలిస్తే, కేవలం ఐదేళ్ల కాలంలోనే పెట్టుబడి విలువ దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఆన్‌లైన్ ఇన్వెస్టర్లకు సుమారు 166 శాతం సంపూర్ణ రాబడి లభించినట్లయింది. అంతేకాకుండా, ఈ ఐదేళ్ల కాలానికి ఇన్వెస్టర్లు ఏటా 2.5 శాతం వడ్డీని కూడా అదనంగా పొందారు. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రచురించిన 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధరల ఆధారంగా ఈ విమోచన ధరను లెక్కించినట్లు ఆర్బీఐ వివరించింది. అక్టోబర్ 23, 24, 27 తేదీల్లోని మూడు పనిదినాల సగటు బంగారం ముగింపు ధర ఆధారంగా యూనిట్‌కు రూ. 12,198గా నిర్ణయించారు. నిబంధనల ప్రకారం, బాండ్ జారీ చేసిన ఐదో సంవత్సరం తర్వాత వచ్చే వడ్డీ చెల్లింపు తేదీల్లో వాటిని ముందస్తుగా విమోచనం చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. బంగారం దిగుమతులను తగ్గించి, ప్రజల పొదుపును ఆర్థిక ఆస్తుల వైపు మళ్లించే లక్ష్యంతో భారత ప్రభుత్వం 2025 నవంబరులో సావరిన్ గోల్డ్ బాండ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రం తరఫున ఆర్బీఐ ఈ బాండ్లను జారీ చేస్తుంది. ఈ బాండ్లకు 8 సంవత్సరాల కాలపరిమితి ఉంటుంది. అయితే, 5 సంవత్సరాల తర్వాత బయటకు వచ్చే వెసులుబాటు ఉంది. వీటిని స్టాక్ ఎక్స్ఛేంజీలలో ట్రేడ్ చేయవచ్చు, ఇతరులకు బదిలీ చేయవచ్చు లేదా బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు హామీగా కూడా ఉపయోగించుకోవచ్చు.



## ధరలు ఇలా..

**చైనాలో వన్‌ప్లస్ 15 బేస్ వేరియంట్ (12జీబీ ర్యామ్ ం 256 స్టోరేజ్) ధరను సుమారు రూ. 50,000గా నిర్ణయించారు.**

**ఇతర వేరియంట్ల ధరలు ఇలా ఉన్నాయి:**

**16జీబీ ర్యామ్ ం 256జీబీ స్టోరేజ్: 4,299 యువాన్లు (సుమారు రూ. 53,000)**

**1జీబీ ర్యామ్ం 512జీబీ స్టోరేజ్: 4,599 యువాన్లు (సుమారు రూ. 57,000)**

**1జీబీ ర్యామ్ ం 512జీబీ స్టోరేజ్: 4,899 యువాన్లు (సుమారు రూ. 61,000)**

**టాప్-ఎండ్ వేరియంట్ (16జీబీ ర్యామ్ 1టీబీ స్టోరేజ్): 5,399 యువాన్లు (సుమారు రూ. 67,000)**



ముంబై: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వన్‌ప్లస్ తన కొత్త ఫ్లాగ్‌షిప్ మోడల్ 'వన్‌ప్లస్ 15'ను చైనా మార్కెట్లో విడుదల చేసింది. సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఫోన్‌ను అధికారికంగా లాంచ్ చేసింది. గతేడాది వచ్చిన వన్‌ప్లస్ 13కు సక్సెసర్గా తీసుకొచ్చిన ఈ కొత్త మోడల్‌లో పలు కీలక అప్‌గ్రేడ్‌లను అందించింది. క్వాల్‌కామ్ నుంచి వచ్చిన సరికొత్త స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 చిప్‌సెట్, 7300ఎమ్ఏహెచ్ భారీ బ్యాటరీ దీని ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. అధికారిక వెబ్‌సైట్ ద్వారా చైనాలో అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

# విపణిలోకి వన్‌ప్లస్ 15

## ఫీచర్లు, ధర వివరాలు ఇవే!

**ఫీచర్లు ఇవే..**

వన్‌ప్లస్ 15 స్మార్ట్‌ఫోన్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత కలర్‌ఓఎస్ 16తో పనిచేస్తుంది. ఇందులో 6.78-అంగుళాల 1.5కె అమోలెడ్ డిస్‌ప్లేను అమర్చారు. ఇది 165హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 1800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. ఈ ఫోన్ క్వాల్‌కామ్ ఆక్టా-కోర్ 3ఎన్ఎమ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 ప్రాసెసర్‌తో వస్తోంది. దీనికి జతగా అడ్రెనో 840 జీపీయూ, 16%+డీ% వరకు ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, 1టీబీ వరకు యూఎఫ్ఎస్ 4.1 స్టోరేజ్ ఉన్నాయి. కెమెరాల విషయానికొస్తే, ఇందులో చతురస్రాకారంలో డిజైన్ చేసిన ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్ ఉంది. ఇందులో 50-మెగాపిక్సెల్ ప్రైమరీ కెమెరా, 50-మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరా, 50-మెగాపిక్సెల్ టెలిఫోటో కెమెరా ఉన్నాయి. సెల్ఫీల కోసం ముందువైపు 32-మెగాపిక్సెల్ కెమెరాను అందించారు. వెనుక కెమెరాతో 8%ఖ% రిజల్యూషన్‌తో సెకనుకు 30 ఫ్రేమ్‌ల వద్ద వీడియోలను రికార్డ్ చేయవచ్చు. ఈ ఫోన్‌లో 7,300ఎమ్ఏహెచ్ భారీ బ్యాటరీని అమర్చారు. ఇది 120డబ్ల్యూ సూపర్ ఫ్లాష్ ఛార్జ్ (వైర్డ్), 50డబ్ల్యూ వైర్‌లెస్ ఫ్లాష్ ఛార్జ్‌కు సపోర్ట్ చేస్తుంది. కనెక్టివిటీ కోసం 5జీ, వై-ఫై 7, ఎన్ఎఫ్‌సీ, జీపీఎస్ వంటి ఫీచర్లు ఉన్నాయి. భద్రత కోసం ఇన్-డిస్‌ప్లే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్‌ను కూడా ఇచ్చారు. ఈ ఫోన్ బరువు సుమారు 211 గ్రాములు.

## తెలుగు రాష్ట్రాల్లో వార్ రూమ్స్

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశాలు.. మొంథా తుఫాను ఎఫెక్ట్**

న్యూఢిల్లీ: 'మొంథా' తీవ్ర తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాలు, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితో పాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. తుపాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుపాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని కూడా ఆయన పేర్కొన్నారు.

## తుర్కియేలో భారీ భూకంపం..

ఇస్తాంబుల్: తుర్కియే (టర్కీ)లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. నేటి వేకువజామున దేశంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భూమి కంపించడంతో ఉలిక్కిపడి లేచారు. ఏం జరుగుతోందో తెలియని ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రం, ప్రభావితమైన ప్రాంతాల పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం అందనప్పటికీ, కొన్ని భవనాలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. భూకంపం సంభవించిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సహాయక చర్యలను ప్రారంభించింది. ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించే పనిలో నిమగ్నమైంది. భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రాంతంలో ఉన్న తుర్కియేలో తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. గతంలో కూడా ఇక్కడ సంభవించిన పలు భూకంపాలు తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే.

## స్టాక్ బ్రోకింగ్ మార్కెట్‌లోకి డ్రీమ్ 11

ముంబై/న్యూఢిల్లీ: ఫాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్ 11 సరికొత్త రంగంలోకి ప్రవేశించనుంది. స్టాక్ బ్రోకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. 'డ్రీమ్ మనీ' పేరుతో స్టాక్ బ్రోకింగ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు కారణంగా డ్రీమ్ 11 తన రియల్ మనీ గేమ్స్‌ను నిలిపివేసింది. దీని ఫలితంగా కంపెనీ ఆదాయం 95 శాతం వరకు క్షీణించింది. ఈ నేపథ్యంలో స్టాక్ బ్రోకింగ్ సేవలను అందించడం ద్వారా నష్టాన్ని పూడ్చుకోవాలని భావిస్తోంది. డ్రీమ్ 11కు ప్రస్తుతం 26 కోట్ల మంది వినియోగదారులు ఉండగా, వారిని రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ మార్కెట్ వైపు మళ్ళించాలని కంపెనీ యోచిస్తోంది. గతంతో పోలిస్తే స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. సులువుగా మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం ఉండటం, జీరో కమీషన్ ట్రేడింగ్ వంటి కారణాల వల్ల ఇన్వెస్టర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది. అయినప్పటికీ, ప్రతి 12 మందిలో ఒక్కరు మాత్రమే ఇన్వెస్టర్లుగా ఉన్నారు. ఇంకా చాలా మంది మార్కెట్‌కు దూరంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో, వారిని ఆకర్షించడంపై డ్రీమ్ 11 దృష్టి సారించింది.

## గాజాకు పాక్ సైన్యం

**ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందంలో భాగంగా దళాల మోహరింపు**

**పాక్ ఆర్మీ చీఫ్, మొసాద్, సీఐఏ అధికారుల రహస్య భేటీ**

ఇస్లామాబాద్: పశ్చిమాసియా రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంలో భాగంగా గాజాలో శాంతి పరిరక్షణకు పాకిస్థాన్ తమ సైన్యాన్ని మోహరించడానికి సిద్ధమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఈ శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దళాల్లో పాక్ సైనికులు కూడా పాలుపంచుకోనున్నారు. ఈ నిర్ణయం వెనుక ఓ రహస్య సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఈజిప్టులో పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిం మునీర్, ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్, అమెరికాకు చెందిన సీఐఏ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ చర్చల అనంతరమే పాక్ దళాల మోహరింపుపై తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. త్వరలోనే ఇస్లామాబాద్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ ఒప్పందం ప్రకారం, పాకిస్థాన్ దాదాపు 20,000 మంది సైనికులను గాజాకు పంపనుంది. ఈ దళాలు గాజాలో అంతర్గత భద్రతను పర్యవేక్షించడం, మానవతా సాయం అందించడం, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి బాధ్యతలు చేపడతాయి. అన్నింటికంటే ముఖ్యంగా, హమాస్‌ను నిరాయుధీకరణ చేయడంలోనూ, సరిహద్దు భద్రతను పటిష్టం చేయడంలోనూ ఈ సైన్యం కీలక పాత్ర పోషించనుంది. ఈ సైనిక మోహరింపునకు ప్రతిఫలంగా పాకిస్థాన్‌కు అమెరికా, ఇజ్రాయెల్ నుంచి భారీ ఆర్థిక ప్రోత్సాహకాలు అందనున్నాయని తెలుస్తోంది. పాక్ దళాలు ఇజ్రాయెల్, గాజాలోని ఇతర మిలిటెంట్ గ్రూపుల మధ్య బఫర్ ఫోర్స్‌గా పనిచేస్తాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిణామం సున్నితమైనదే అయినా, వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని ఇజ్రాయెల్ మీడియా విశ్లేషిస్తోంది. కాగా, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక కార్యకలాపాలకు అత్యధికంగా సైన్యాన్ని పంపే దేశాల్లో పాకిస్థాన్ ఒకటిగా ఉంది. ఇప్పటికే ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో ఐరాస మిషన్ల కింద 2 లక్షల మందికి పైగా పాక్ సైనికులు సేవలు అందించారు.

## ఆరెస్సెస్ కార్యకలాపాలపై కర్ణాటక ఆంక్షలు!

**సిద్ధరామయ్య ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు**

బెంగళూరు: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల వ్యవహారంలో కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో ఆరెస్సెస్ తదితర సంస్థల కార్యకలాపాలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఆరెస్సెస్ ఏర్పడి వందేళ్లయిన నేపథ్యంలో భారీస్థాయిలో కవాతులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థలు, సంఘాలు తమ కార్యకలాపాల కోసం ప్రభుత్వ మైదానాలు, రహదారులు, బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థల ఆవరణలను వినియోగించుకోవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి చేసింది. ఈ మేరకు అక్టోబర్ 18న కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగాలను ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అరెస్సెస్‌ను నిషేధించే ఉద్దేశంతో సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

## రష్యా ఫ్లుటోనియం ఒప్పందం రద్దు

**ట్రంప్‌కు పుతిన్ షాక్**

మాస్కో: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ గట్టి షాకిచ్చారు. ఉక్రెయిన్ తో యుద్ధాన్ని ఆపేయాలన్న తన సూచనను పెడచెవిన పెట్టాడని పుతిన్ పై ట్రంప్ ఇప్పటికే ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలోనే అమెరికాతో గతంలో రష్యా కుదుర్చుకున్న ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ రద్దు చేసుకున్నారు. దీనికి సంబంధించిన చట్టంపై తాజాగా పుతిన్ సంతకం చేశారు. ఈ పరిణామం మళ్లీ అణు ఉద్రిక్తతలకు దారితీస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. 2000 సంవత్సరంలో అమెరికా, రష్యాల మధ్య ఫ్లుటోనియం నిర్వహణపై ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2010లో ఈ ఒప్పందాన్ని సవరించారు. దీని ప్రకారం.. రష్యా తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ఫ్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి వాడకూడదు. ఈ నిల్వలను పౌర అణు విద్యుత్ తయారీ కోసం వినియోగించుకోవాలని ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. దీంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారీని అడ్డుకున్నట్లు అప్పట్లో అమెరికా అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒబామా హయాంలో 2016 సంవత్సరం అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీంతో ఫ్లుటోనియం ఒప్పందాన్ని పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు.

## భారతీయులకు ఏడాది పాటు చాట్‌జీపీటీ గో ఉచితం

**నవంబర్ 4 నుంచి ఈ ప్రత్యేక ప్రమోషనల్ ఆఫర్ ప్రారంభం**

**బెంగళూరులో తొలి డెవ్‌డే ఎక్స్ఛేంజ్ ఈవెంట్ సందర్భంగా ప్రకటన**

బెంగళూరు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో సంచలనాలు సృష్టిస్తున్న ఓపెన్‌ఏఐ, భారతీయ యూజర్లకు ఒక శుభవార్త ప్రకటించింది. తన అడ్వాన్స్‌డ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ అయిన 'చాట్‌జీపీటీ గో'ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించింది. నవంబర్ 4 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక ప్రమోషనల్ పీరియడ్‌లో సైన్ అప్ చేసే యూజర్లందరికీ ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బెంగళూరులో నవంబర్ 4న నిర్వహించనున్న తమ తొలి 'డెవ్‌డే ఎక్స్ఛేంజ్' ఈవెంట్ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓపెన్‌ఏఐ పేర్కొంది. భారత్‌కు తొలి ప్రాధాన్యం ఇచ్చే వ్యూహంలో భాగంగా దేశంలో ఏఐ టూల్స్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ఆఫర్‌ను ప్రకటించింది. ప్రభుత్వ 'ఇండియాఏఐ మిషన్'కు మద్దతుగా కూడా ఈ చర్య దోహదపడుతుందని అభిప్రాయపడింది.

## కెనడాలో భారత సంతతి వ్యాపారవేత్త హత్య

ఒట్టావా: కెనడాలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, 'కానమ్ ఇంటర్నేషనల్' అధ్యక్షుడు దర్శన్ సింగ్ సాహ్సీ (68) కాల్పుల్లో మరణించారు. బ్రిటిష్ కొలంబియాలోని అబాట్స్‌ఫోర్డ్‌లో ఆయన నివాసం వెలుపల ఈ ఘటన జరిగింది. కారులో కూర్చుంటున్న సమయంలో ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపి పారిపోయినట్లు తెలుస్తోంది. అబాట్స్‌ఫోర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9:22 గంటలకు రిడ్జ్‌వ్యూ డ్రైవ్‌లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి, కారులో ఉన్న సాహ్సీ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ప్రథమ చికిత్స సిబ్బంది వెంటనే వైద్య సహాయం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, విచారణ ప్రాథమిక దశలో ఉందని సార్జెంట్ పాల్ వాకర్ తెలిపారు. కేసును అబాట్స్‌ఫోర్డ్ మేజర్ క్రైమ్ యూనిట్ నుంచి ఇంటిగ్రేటెడ్ హోమిసైడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌కు బదిలీ చేశామని, తదుపరి వివరాలను వారే వెల్లడిస్తారని పేర్కొన్నారు. ముందుజాగ్రత్త చర్యగా సమీపంలోని మూడు పాఠశాలలకు కొద్దిసేపు షెల్టర్-ఇన్-ప్లేస్ ప్రోటోకాల్ అమలు చేశారు. దర్శన్ సింగ్ సాహ్సీ పంజాబ్‌లోని లుధియానా జిల్లా, రాజ్‌గఢ్ గ్రామానికి చెందినవారు. ఒక రైతు కుటుంబానికి చెందిన ఆయన 1991లో కెనడాకు వలస వెళ్లి, వ్యాపారవేత్తగా అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన స్థాపించిన కానమ్ గ్రూప్, ప్రపంచంలోని అతిపెద్ద క్లాతింగ్ రీసైక్లింగ్ కంపెనీలలో ఒకటిగా గుర్తింపు పొందింది. 40కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆయన గుజరాత్‌లోని కాండ్లాలో కూడా వ్యాపారం నిర్వహిస్తున్నారు. సాహ్సీ ఉదార స్వభావం కలిగిన వ్యక్తిగా పేరు పొందారు. తన సంస్థలో ఎక్కువ మంది పంజాబీలకు ఉపాధి కల్పించారు.

# బెంగాల్, బీహార్‌లో రెండు చోట్లా ఓట్లు

**ప్రశాంత్ కిశోర్‌కు ఈసీ నోటీసులు**

పాట్నా: రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) కొత్త వివాదంలో చిక్కుకున్నారు. ఆయన పేరు బీహార్‌తో పాటు పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో కూడా నమోదైనట్లు ఆరోపణలు రావడంతో కలకలం రేపింది. ఈ విషయంపై వివరణ ఇవ్వాలని కోరుతూ బీహార్ ఎన్నికల అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే, ప్రశాంత్ కిశోర్ పేరు రెండు రాష్ట్రాల్లో ఓటరుగా నమోదై ఉందని అక్టోబర్ 28న ఓ జాతీయ పత్రికలో కథనం ప్రచురితమైంది. దాని ప్రకారం, బీహార్‌లోని ససారాం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కర్ఘర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఆయనకు ఓటు ఉంది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ నియోజకవర్గంలోనూ ఆయన పేరు ఓటరుగా నమోదై ఉంది. అక్కడ ఆయన చిరునామాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఉన్న నెం. 121, కాళీఘాట్ రోడ్ అని పేర్కొన్నారు. ఈ కథనం ఆధారంగా కర్ఘర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కిశోర్‌కు నోటీసులు జారీ చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 17 ప్రకారం ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు కావడం చట్టవిరుద్ధమని నోటీసులో స్పష్టం చేశారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే ఏడాది వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. కర్ఘర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ ఓటర్ ఐడీ నంబర్ ఐయూజె1323718 అని నోటీసులో పేర్కొన్నారు. "ఒకవేళ మీ పేరు ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో నమోదై ఉంటే, ఆ విషయంపై మూడు రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలి. లేనిపక్షంలో ఎన్నికల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని రిటర్నింగ్ అధికారి ఆదేశించారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, జన్ సురాజ్ యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళుతున్న ప్రశాంత్ కిశోర్‌కు ఈ వివాదం ఇబ్బందికరంగా మారింది. ఆయన విశ్వసనీయతను ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలకు ఇదొక అస్త్రంగా మారే అవకాశం ఉంది. ఈ ఆరోపణలపై ప్రశాంత్ కిశోర్ బృందం నుంచి ఇంకా అధికారికంగా ఎలాంటి స్పందన రాలేదు.




# లాభాల స్వీకరణతో స్వల్ప నష్టాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 150.68 పాయింట్లు నష్టపోయి 84,628.16 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 29.85 పాయింట్లు క్షీణించి 25,936.20 వద్ద ముగిసింది. విశ్లేషకుల ప్రకారం, డైలీ చార్టుల్లో నిఫ్టీ టెక్నికల్‌గా పటిష్టంగానే ఉందని, 21-ఈఎంఏ (ఎక్స్‌పోనెన్షియల్ మూవింగ్ యావరేజ్) పైన ట్రేడ్ అవుతున్నంత వరకు బుల్లిష్ ధోరణి కొనసాగుతుందని తెలిపారు. "ఆర్ఎస్ఐ సూచిక బుల్లిష్ క్రాస్‌ఓవర్‌లో ఉంది. స్వల్పకాలంలో నిఫ్టీ 26,000 స్థాయిని దాటితే మంచి ర్యాలీ చూసే అవకాశం ఉంది. పై స్థాయిలో 26,300 వద్ద నిరోధం, కింది స్థాయిలో 25,850 వద్ద మద్దతు కనిపిస్తోంది" అని నిపుణులు వివరించారు. సెన్సెక్స్ ప్యాక్‌లో ట్రెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా %డ% మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు, టాటా స్టీల్, లార్సెన్ %డ% టుబ్రో (ఎల్%డ%టీ), ఎస్‌బీఐ, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడి మార్కెట్ నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.02 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. అయితే, నిఫ్టీ రియల్టీ అత్యధికంగా నష్టపోగా, ఐటీ, ఎనర్జీ, ఆర్థిక సేవలు, ఎఫ్ఎంసీజీ, ఫార్మా రంగాలు కూడా నష్టాలతోనే ముగిశాయి. "మంత్లీ ఎక్స్‌పైరీ మరియు బలహీనమైన ప్రపంచ సంకేతాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అయితే, కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్ల ఆసక్తి కనిపించడం మదుపరులలో ఉన్న విశ్వాసాన్ని సూచిస్తోంది. ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం, దేశీయ కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు మెరుగుపడతాయన్న అంచనాలు మార్కెట్‌కు మద్దతుగా నిలుస్తాయి" అని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.



ఈవార్తలు
వినోదవాణి CINEMA
బుధవారం 29-10-2025 www.evarthalu.com


లవ్యూరి చిత్రం


ఐశ్వ అగర్వాల్

# రవితేజ, నవీన్ కాంబో..



మాస్ జాతర సినిమాతో మూవీ లవర్స్‌కు పక్కా వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు టాలీవుడ్ యాక్టర్ రవితేజ. శుక్రవారం మాస్ జాతర పెయిడ్ ప్రీమియర్ వేయనున్నారు. ఈ చిత్రంతోపాటు కిశోర్ తిరుమల దర్శకత్వంలో కూడా ఆర్‌టీ 76 ప్రాజెక్టును చేస్తున్నాడు. ఈ మూవీ 2026 సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతుంది. కాగా ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజ కొత్త మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో రౌండప్ చేస్తోంది. జాతి రత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాలతో సూపర్ ఫేం సంపాదించాడు యంగ్ యాక్టర్ నవీన్ పొలిశెట్టి. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న అనగనగా ఒక రోజు 2026 సంక్రాంతికి విడుదల కానుంది. కాగా ఈ ఇద్దరు సంక్రాంతి హీరోలు కలిసి ఓ సినిమా చేయబోతున్నారట. ధమాకా రైటర్ ప్రసన్నకుమార్ బెజవాడ రవితేజ, నవీన్ పొలిశెట్టి కోసం ఓ కథను సిద్ధం చేసి వారికి వినిపించగా.. ఇద్దరూ స్క్రిప్ట్‌కు బాగా కనెక్ట్ అయ్యారని ఇన్‌సైడ్ టాక్. ఎక్కడికి పోతావు చిన్నవాడా, నా సామి రంగా, నేను లోకల్, దాస్ కా ధమ్‌కీతోపాటు పలు చిత్రాలకు డైలాగ్స్ అందించాడు ప్రసన్న కుమార్ బెజవాడ. రవితేజ, నవీన్ పొలిశెట్టిలో కామిక్ టైమింగ్ విషయానికొస్తే ఎవరి స్టైల్ వారిదే. మరి అంతా అనుకున్నట్టు కుదిరితే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయడం పక్కా అని చెప్పొచ్చు. మరి ఈ క్రేజీ కాంబోపై రానున్న రోజుల్లో అధికారిక ప్రకటన ఏమైనా వస్తుందనేది చూడాలి. మరి ఈ ఇద్దరిని డైరెక్ట్ చేసేది ఎవరనేది ఆసక్తికరంగా మారింది.



# రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు



తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. సినీ, రాజకీయ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఈ బెదిరింపుల నేపథ్యంలో తమిళనాడు అధికారులు హై అలర్ట్ అయ్యారు. తాజాగా తమిళ చిత్ర పరిశ్రమలోని అగ్ర నటులైన రజనీకాంత్, ధనుష్ నివాసాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మేరకు చెన్నైలోని డీజీపీ కార్యాలయానికి మంగళవారం తెల్లవారుజామున ఒక ఈమెయిల్ అందింది. అందులో చెన్నై పోయస్ గార్డెన్‌లో ఉన్న రజనీకాంత్, ధనుష్ ఇళ్లతో పాటు, కీల్పాక్కంలో నివసించే తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ఇంటికి కూడా బెదిరింపులు ఉన్నట్లు పేర్కొనబడింది. ఈ సమాచారం అందిన వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు, బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌ల సహాయంతో ఆయా ప్రాంతాలలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ పరిణామాల దృష్ట్యా చెన్నై నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా తమిళనాడులో ప్రముఖులకు బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో అక్టోబర్ 3న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సినీ నటి త్రిష నివాసాలతో పాటు బీజేపీ ప్రధాన కార్యాలయం, డీజీపీ ఆఫీస్ మరియు రాజ్‌భవన్ వంటి కీలక ప్రాంతాలకు బెదిరింపులు వచ్చాయి. ఆ తర్వాత అక్టోబర్ 13న మరోసారి ఎంకే స్టాలిన్, రజనీకాంత్ నివాసాలకు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. వరుస బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు వేగంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందే: రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానాతో కలిసి నటించిన చిత్రం థామా. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీ మంచి టాక్ తెచ్చుకుంది. థామా సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తోంది రష్మిక మందన్నా. ఈ భామ ప్రస్తుతం రాహుల్ రవీంద్రన్ డైరెక్ట్ చేస్తున్న ది గర్ల్‌ఫ్రెండ్‌లో నటిస్తోంది. దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తోన్న ఈ మూవీ నవంబర్ 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. కాగా ఓ ఇంటర్వ్యూలో సినీ ఇండస్ట్రీలో 8 గంటల పని దినంపై స్పందించింది రష్మిక మందన్నా. అతిగా పని చేయడం అంతగా సూచించదగిన విషయం కాదని.. స్థిరమైంది కూడా కాదని చెప్పింది. అంతేకాదు ప్రతీ ఒక్కరూ మొదట వారి ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. తన టీం పట్ల ఉన్న బాధ్యతల నేపథ్యంలో తాను తరచూ అతిగా పనిచేయాల్సి వచ్చేదని.. అయితే యాక్టర్లు, సిబ్బంది ఇద్దరికీ ఆరోగ్యకరమైన పని, జీవన సమతుల్యతను కాపాడుకోవడానికి సినీ పరిశ్రమ 9 నుండి 6 గంటల షెడ్యూల్‌కు సమానమైన స్థిరమైన పని గంటలను ఫిక్స్ చేయాలని అభిప్రాయపడింది.



# ఎడిసన్ ఆఫ్ ఇండియా

### ఆర్ మాధవన్ మరో ప్రయోగం

రాకెట్రి : నంబి ఎఫెక్ట్ కమర్షియల్ విజయం తర్వాత, ఆర్.మాధవన్ మరోసారి సైంటిస్ట్ పాత్రలో నటిస్తున్నాడు. రాకెట్ సైన్స్ పితామహుడిగా పేరున్న ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ (తమిళియన్) పాత్రలో అతడి నటనకు ప్రశంసలు కురిసాయి. 2022లో విడుదలైన ఈ చిత్రం ఉత్తమ ఫీచర్ ఫిలిం కేటగిరీలో జాతీయ అవార్డును సైతం అందుకుంది. ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో రూపొందించిన మాధవన్ టైటిల్ పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించాడు. ఇప్పుడు మాధవన్ మరో సైంటిస్ట్ పాత్రలో నటిస్తున్నారు. భారతీయ సైంటిస్ట్ -ఇంజనీర్ జిడి నాయుడుగా అతడు తనను తాను తెరపై ఆవిష్కరించుకుంటున్నారు. పారిశ్రామిక మార్గదర్శకుడు నాయుడు పాత్రలో మాధవన్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ తాజాగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్ చూడగానే.. సైంటిస్ట్ నాయుడు ఒరిజినల్ గెటప్‌లోకి మ్యాడీ ఒదిగిపోయిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. బట్టతల.. సోడాబుడ్డి కళ్లద్దంతో వృద్ధ ఇంజనీర్‌గా కనిపిస్తున్న మాధవన్ ని గుర్తు పట్టడం ఎవరికైనా చాలా కష్టం. వర్క్‌షాప్‌లో లోహానికి టంకం వేస్తూ అతడు నిజమైన ప్రయోగశీలిగా కనిపిస్తున్నాడు. జి.డి. నాయుడు ఎవరి పాఠాలు వినలేదు. అతడు సెల్ఫ్ టీచింగ్ ఇంజనీర్.. పారిశ్రామికవేత్తగా తనను తాను ఆవిష్కరించుకున్నాడు.



# జటాధరతో శిల్పా శిరోద్కర్ రీఎంట్రీ

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'జటాధర'. సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాతో సీనియర్ నటి శిల్పా శిరోద్కర్ చాలా కాలం తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. నవంబర్ 7న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా ఆమె సినిమా విశేషాలను పంచుకున్నారు. చాలా ఏళ్ల క్రితం వచ్చిన 'బ్రహ్మ' తర్వాత మళ్లీ తెలుగులో నటించడం ఎంతో సంతోషంగా ఉందని శిల్పా శిరోద్కర్ తెలిపారు. "ఈ చిత్రంలో నేను 'శోభ' అనే పాత్రలో కనిపిస్తాను. డబ్బుపై విపరీతమైన ఆశ, ఎలాగైనా ధనవంతురాలు కావాలనే తపన ఉన్న పాత్ర అది. ఇలాంటి పాత్ర నేను ఇంతకుముందు చేయలేదు, అందుకే చాలా సవాలుగా అనిపించింది. దర్శకుల స్పష్టమైన విజన్‌తో ఈ పాత్రను పోషించగలిగాను" అని ఆమె వివరించారు.




### నవంబర్ 21 నుంచి

# ఫ్యామిలీ మ్యాన్ 3

మన ఇండియన్ ఓటీటీ దగ్గర సెన్సేషనల్ హిట్ అయ్యిన ఒరిజినల్ కంటెంట్ లో నటుడు మనోజ్ బాజ్ పాయి ప్రధాన పాత్రలో దర్శకులు రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన వెబ్ సిరీస్ ది ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ కూడా ఒకటి. అయితే ఇప్పటికే రెండు సీజన్స్ వచ్చి వరల్డ్ వైడ్ మంచి రెస్పాన్స్ ని అందుకున్నాయి. ఇక నెక్స్ట్ సీజన్ 3 కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఫైనల్ గా డేట్ ని ఆమెజాన్ ప్రైమ్ వీడియో వారు రివీల్ చేసేసారు. ఓ ఇంట్రెస్టింగ్ ట్రైలర్ కట్ తో ది ఫ్యామిలీ మ్యాన్ ఈ నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ కి వస్తున్నట్లు అనౌన్స్ చేసేసారు. దీనితో ఈ సీజన్ కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి మాత్రం ఇది బిగ్ అప్డేట్ అని చెప్పాలి. ఇక ఈ స్పై యాక్షన్ సిరీస్ ఎలాంటి ట్రీట్ అందిస్తుందో అప్పుడు వరకు వేచి చూడాల్సిందే.

# స్మృతి మంధాన నం.1




ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన దుమ్మురేపింది. కెరీర్ బెస్ట్ రేటింగ్ పాయింట్స్‌తో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ప్రస్తుతం భారత్ వేదికగా జరుగుతున్న వన్డే ప్రపంచకప్ 2025లో స్మృతి మంధాన అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న సంగతి తెలిసిందే. న్యూజిలాండ్‌తో జరిగిన గత లీగ్ మ్యాచ్‌లో మంధాన సెంచరీతో చెలరేగిన విషయం విదితమే. ఈ టోర్నీలో ఇప్పటి వరకు 6 ఇన్నింగ్స్‌లు ఆడిన మంధాన 365 పరుగులతో టాప్ స్కోరర్‌గా కొనసాగుతోంది. ఇదే టోర్నీలో ఆస్ట్రేలియాపై 80, ఇంగ్లండ్‌పై 88 పరుగులు చేసింది. దాంతో స్మృతి మంధాన ఖాతాలో 828 రేటింగ్ పాయింట్స్ చేరాయి. స్మృతి మంధాన కెరీర్‌లో ఇదే అత్యుత్తమ రేటింగ్ పాయింట్స్. మంధాన తర్వాత ఆష్లీన్ గార్డ్‌నర్(731) రేటింగ్ పాయింట్స్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఆమె ఆరు స్థానాలు ఎగబాకింది. మంధానకు ఆమెకు 97 పాయింట్ల వ్యత్యాసం ఉంది. లారా వోల్వార్ట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో స్థానంలో నిలిచింది. భారత్ నుంచి మరే బ్యాటర్ టాప్-10లో లేకపోవడం గమనార్హం. హర్మన్ ప్రీత్ కౌర్ మూడు స్థానాలు దిగజారి 18వ స్థానంలో నిలవగా.. జెమీమా రోడ్రిగ్స్ 8 స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి చేరింది. న్యూజిలాండ్‌పై సెంచరీతో చెలరేగిన ప్రతికా రావల్ 12 స్థానాలు ఎగబాకి 27వ ర్యాంక్ అందుకుంది. బౌలింగ్ విభాగంలో ఆస్ట్రేలియా బౌలర్ అలాన కింగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఆ దేశానికే చెందిన ఆష్లీ గార్డ్‌నర్ రెండో స్థానంలో నిలిచింది. సౌతాఫ్రికా బౌలర్ మరిజన్నే కాప్ నాలుగు, దీప్తి శర్మ ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. గురువారం జరగనున్న సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌కు టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. ఓపెనర్ ప్రతీకా రావల్ గాయంతో జట్టుకు దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మ జట్టులోకి వచ్చింది. సమష్టిగా రాణిస్తేనే ఆస్ట్రేలియాపై టీమిండియాకు విజయం దక్కనుంది.




# నేటి నుంచే సెమీస్ యుద్ధం

**మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కీలక మ్యాచ్‌లకు బుధవారం నుంచి తెరలేవనుంది. లీగ్ దశలో అదరగొట్టిన నాలుగు జట్లు ఇప్పుడు సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు ఇప్పటికే మాజీ ఛాంపియన్లుకాగా .. భారత్, దక్షిణాఫ్రికా తొలి కప్ కోసం చకోర పక్షుల్లా నిరీక్షిస్తున్నాయి.**

**నాకౌట్ దశలో తిరుగులేని ఆసీస్, ఇంగ్లీష్ జట్లకు చెక్ పెడితే తప్ప కొత్త విజేతను చూడలేం. అన్ని విభాగాల్లో దుర్భేద్యంగా ఉన్న ఈ రెండు జట్లకు టీమిండియా, సఫారీ టీమ్‌లు మట్టికరిపించాలంటే సర్వశక్తులు ఒడ్డాల్సిందే. ఒకరిద్దరి మీద ఆధారపడకుండా సమిష్టిగా రాణించడం తప్ప మరో దారి లేదు.**

వరల్డ్ కప్ అంటే చాలు.. ఆస్ట్రేలియా జట్టు ట్రోఫీని తన్నుకపోవడం పరిపాటి అయింది. పురుషుల జట్టు మాత్రమే కాదు ఆ దేశపు ఆడ సింహాలు కూడా రికార్డు స్థాయిలో కప్‌ను తన్నుకుపోయాయి. ఎక్కడ టోర్నీ జరిగినా విజేతలం మేమే అన్నట్టుగా ఆసీస్ (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022, ) ఎనిమిదిసార్లు, ఇంగ్లండ్ జట్టు (1973, 1993, 2009, 2017) నాలుగుసార్లు ఛాంపియన్లు అయ్యాయి. ఈ రెండు జట్లను కాదని ఒకేఒకసారి 2000 సంవత్సరంలో న్యూజిలాండ్ విశ్వవిజేతగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు పదమూడో సీజన్‌లోనూ అలీసా హేలీ సారథ్యంలోని కంగారూ టీమ్‌అజేయంగా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లి తొమ్మిదోసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది. మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమి మినహా ఛాంపియన్ ఆటతో ఇంగ్లండ్ సెమీస్ బెర్తు దక్కించుకుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, హీథర్ నైట్, అమీ జోన్స్ రాణిస్తుండగా.. స్పిన్నర్లు లిన్సే స్మిత్, డీన్స్, ఎకిల్‌స్టోన్ ఆ జట్టు విజయాల్లో కీలకం అవుతున్నారు. సెమీస్‌లోనూ విజయంతో ఐదో కప్ వేటకు మరింత చేరువవ్వాలనే పట్టుదలతో ఉంది ఇంగ్లండ్. ఇక.. దక్షిణాఫ్రికా కథ వేరు. ఆరంభ పోరులోనే ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోలేక 69 పరుగులకే ఆలౌటయ్యింది సఫారీ టీమ్. అయితే.. మ్యాచ్ అనంతరం 'మేము 69 ఆలౌట్ కన్నా ఎంతో మెరుగైనవాళ్లం' అని చెప్పిన కెప్టెన్ లారా వొల్వార్ట్ ఊహించని విధంగా జట్టును సెమీస్ చేర్చింది. మిడిలార్డర్లలో చోలే ట్రయాన్, మరినే కాప్.. ఫినిషర్ డీక్లెర్క్ తుఫాన్ ఇన్నింగ్స్‌లకు తోడు.. స్పిన్నర్ మ్లాబా జోరుతో వరుసగా ఐదు విజయాలతో దర్జాగా నాకౌట్ పోరుకు అర్హత సాధించింది. 97 పరుగులకే కుప్పకూలి చివరి లీగ్ మ్యాచ్‌లోనూ విజయంతో సెమీస్‌కు ఆత్మవిశ్వాసం కూడకట్టుకోవాలనుకున్న సఫారీల కథ ఆస్ట్రేలియాపై ఓటమితో మళ్లీ మొదటికి వచ్చింది. విశాఖపట్టణంలో భారత జట్టుపై 3 వికెట్ల తేడాతో గెలుపొందిన లారా బృందం అదే వేదికపై ఒత్తిడికి తలొగ్గింది. ఆసీస్ లెగ్ స్పిన్నర్ అలనా కింగ్(7-218) ధాటికి 97 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం మూటగట్టుకుంది. మరి.. సెమీస్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చి తొలి మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటుందా? లేదా? అనేది రేపటితో తెలిసిపోనుంది. నిరుడు టీ20 వరల్డ్ కప్ ఆసాంతం దుమ్మురేపిన లరా బృందం.. చివరకు ఫైనల్లో మాత్రం కుదేలైంది. తొలిసారి పొట్టి ప్రపంచ కప్ ఛాంపియన్ అయ్యే అవకాశాన్ని చేజార్చుకుంది. అమేలియా కేర్ ఆల్‌రౌండ్ షోతో విజేతగా అవతరించిన న్యూజిలాండ్ తొలి కప్ కలను సాకారం చేసుకుంది.

# అభిషేక్ శర్మ కోసం..




టీమ్‌ఇండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మను ఎదుర్కోవడానికి తమ జట్టు సిద్ధంగా ఉందని ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ అన్నాడు. ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా అయిదు టీ20ల సిరీస్ ఆడనుంది. దీనిలో భాగంగా రేపు (అక్టోబర్ 29) కాన్‌బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్ష్ మాట్లాడాడు. 'అభిషేక్ శర్మ అద్భుతమైన నైపుణ్యమున్న ఆటగాడు. ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున చక్కగా ఆడాడు. అతడు నిజంగా మాకో ఛాలెంజ్. కానీ మేం అతణ్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో తలపడి మనల్ని మనం పరీక్షించుకోవాలి' అని మిచెల్ మార్ష్ అన్నాడు. అలాగే జోష్ ఇంగ్లిస్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండే విషయమై మార్ష్ మాట్లాడాడు. అతడు ఇటీవల న్యూజిలాండ్ సిరీస్‌లో గాయం వల్ల ఆసీస్ జట్టుకు దూరమయ్యాడు. 'జోష్ ఇంగ్లిష్ ఫిట్‌నెస్ సాధించాడు. జట్టుకు అందుబాటులో ఉన్నాడు. అతడు మాకు చాలా ముఖ్యమైన ఆటగాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడు' అని మార్ష్ వివరించాడు. అభిషేక్ శర్మ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. అతడు 23 ఇన్నింగ్స్‌ల్లో 36.91 యావరేజ్‌తో 849 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు, అయిదు అర్ధశతకాలున్నాయి. టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా ఇప్పటి వరకు 32 టీ20ల్లో తలపడింది. అందులో 20 మ్యాచుల్లో భారత జట్టు విజయం సాధించింది. ఆసీస్ జట్టు 11 మ్యాచుల్లో గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. గత మూడు టీ20 సిరీస్‌ల్లోనూ భారత జట్టు కంగారూలను ఓడించింది.

## రంజీ ట్రోఫీలో షమీ జోరు



రంజీ ట్రోఫీలో భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ నిప్పులు చెరుగుతున్నాడు. తన ఫిట్‌నెస్‌పై వస్తున్న తప్పుడు వార్తలకు చెక్ పెడుతూ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడీ స్పీడ్‌స్టర్. ఉత్తరాఖండ్‌పై ఏడు వికెట్లతో చెలరేగిన షమీ.. ఈసారి గుజరాత్‌పైనా విజృంభించాడు. చివరిరోజు ఐదు వికెట్లు తీసిన ఈ పేస్ గన్.. బెంగాల్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. రెండో ఇన్నింగ్స్‌లో విజయం దిశగా సాగుతున్న ప్రత్యర్థిని షమీ దెబ్బకొట్టగా.. పన్నెండేళ్ల తర్వాత బెంగాల్ జట్టు గుజరాత్‌పై విజయాన్ని చవిచూసింది. టీమిండియాకు మళ్లీ ఆడేందుకు ఎదురుచూస్తున్న షమీ.. రంజీ ట్రోఫీ రెండో రౌండ్‌లోనూ చెలరేగిపోతున్నాడు. ఉత్తరాఖండ్‌పై ఏడు వికెట్లు.. గుజరాత్‌పై ఐదు వికెట్లు తీసిన ఈ స్పీడ్‌స్టర్ సెలెక్టర్లకు సవాల్ విసురుతున్నాడు. సొంతగడ్డపై నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌కు స్క్వాడ్ ఎంపిక సమయంలో తన పేరును పరిశీలించాలని చెప్పకనే చెబుతున్నాడు. రెండో ఇన్నింగ్స్‌ను 214/8 వద్ద డిక్లేర్ చేసిన బెంగాల్‌కు గుజరాత్ షాకిచ్చేలా కనిపించింది.

## ఆసీస్‌పైనా ముగ్గురు స్పిన్నర్ల వ్యూహమే: సూర్య




ఆసియా కప్ ఛాంపియన్‌గా మొదటి టీ20 సిరీస్‌కు సన్నద్ధమవుతోంది టీమిండియా. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు ఐదు మ్యాచ్‌ల పొట్టి సీరీస్‌ను పట్టేసేందుకు వ్యూహరచన చేస్తోంది. ఆసీస్‌పై కూడా ముగ్గురు స్పిన్నర్ల వ్యూహాన్నే అమలు చేయనుంది. బుధవారం తొలి టీ20 జరుగునున్నందున కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ కాంబినేషన్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఆస్ట్రేలియా అంటేనే పేస్, బౌన్సీ పిచ్‌లకు పెట్టింది పేరు. అందుకే.. కంగారూ టీమ్‌ను ఓడించాలంటే పేస్ బలం ఎంతో ముఖ్యం. అయితే.. భారత్ మాత్రం ఈ ఫంథాను అనుసరించబోదు అంటున్నాడు సారథి సూర్య. బుధవారం తొలి మ్యాచ్ ఉన్నందున జట్టు కూర్పు ఎలా ఉండనుంది? అనే ప్రశ్నకు బదులిస్తూ.. పరిస్థితులను బట్టి కాంబినేషన్లు మార్చడం మా నైజం కాదని తేల్చిపారేశాడు మిస్టర్ 360. 'పరిస్థితులకు తగ్గట్టు అని చెప్పి భారత జట్టు కూర్పులో భారీగా మార్పులు చేయం. ఎందుకంటే బౌన్సీ పిచ్‌లున్న దక్షిణాఫ్రికా పర్యటనలోనూ ఒకే ఫాస్ట్ బౌలర్, ఒక ఆల్‌రౌండర్.. ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాం. ఆసియాలో అయినా.. ఆసియా అవతల అయినా సరే మేము మ్యాచ్‌ల కోసం కాకుండా వరల్డ్ కప్ లక్ష్యంగా సాగుతున్నాం అని సూర్య వెల్లడించాడు.




## 2027 తర్వాతే కోహ్లీ రిటైర్మెంట్

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన అంతర్జాతీయ కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. అతడు ఇప్పటికే టీ 20, టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. అయితే ఆసీస్‌తో మూడు వన్డేల నేపథ్యంలో మొదటి రెండు మ్యాచుల్లో వరుసగా రెండుసార్లు డకౌట్‌గా వెనుదిరిగాడు. మూడో వన్డేలో మాత్రం రిథమ్ అందుకుని 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ తర్వాత దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ విరాట్‌కు మద్దతుగా నిలిచాడు. 'కోహ్లీని సెలబ్రేట్ చేసుకోనివ్వండి. అతడు లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకోనివ్వండి. కృతజ్ఞతలు అందుకునేందుకు విరాట్ అర్హుడు. నాకు తెలిసి అతడిలో మరో అయిదేళ్లు క్రికెట్ ఆడగల సత్తా ఉంది. నా అభిప్రాయం ప్రకారం కోహ్లీ వన్డే వరల్డ్ కప్ 2027 తర్వాత తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాడు. ఐపీఎల్‌లో కొనసాగుతాడు. అతడు మరో మూడు లేదా నాలుగు సంవత్సరాల పాటు, కుదిరితే అయిదేళ్లు మనకు మైదానంలో కనిపిస్తాడు. ఐపీఎల్ కంటే కూడా వరల్డ్‌కప్ సన్నద్ధతకు చాలా సమయం వెచ్చించాల్సి వస్తుంది' అని ఏబీ డివిలియర్స్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. అలాగే జట్టులో విరాట్‌కు ఎంతటి ప్రముఖ పాత్ర ఉందో కూడా అతడు వివరించాడు. 'జట్టులో కోహ్లీ ఉన్నాడంటే చాలు.. మిగతా యువ ఆటగాళ్లు మానసికంగా దృఢంగా ఉంటారు. విరాట్, రోహిత్ శర్మ ఇతర ప్లేయర్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతారనడంలో సందేహం లేదు. మరో విషయం ఏంటంటే.. వారు కొన్నిసార్లు బ్యాట్‌తో రాణించలేకపోయినా.. జట్టు మీద తమదైన ముద్ర వేయగలరు' అని ఏబీ డివిలియర్స్ విశ్లేషించాడు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 29-10-2025 | www.evarthalu.com



# సహజీవనం చట్టబద్ధమా?



భారత్‌లో లివ్-ఇన్ రిలేషన్‌షిప్ (సహజీవనం) చట్టబద్ధమే. కానీ అది వివాహం స్థాయి హక్కులు ఇవ్వదు. ఇది పూర్తిగా వ్యక్తిగత ఎంపిక, రాజ్యాంగ హక్కు కిందకు వస్తుంది. కానీ, దీనికి సంబంధించి కొన్ని చట్టపరమైన ఆంక్షలు, హక్కులు, బాధ్యతలు ఉన్నాయి. ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ) కింద సహజీవనం చట్టబద్ధమైనదిగా గుర్తించబడింది. 'ఎస్ కుష్బూ వర్సెస్ కన్నీఅమ్మల్ (2010)' కేసు ప్రకారం లివ్-ఇన్ రిలేషన్‌షిప్ అనేది వివాహం లాంటిది కాదు కానీ, ఇది వ్యక్తిగత స్వేచ్ఛ కిందకు వస్తుంది. ఇంద్రా శర్మ వర్సెస్ వీకేవీ శర్మ (2013) కేసులో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ను "రిలేషన్‌షిప్ ఇన్ ది నేచర్ ఆఫ్ మ్యారేజ్" అని నిర్వచించారు. కానీ దీనికి వివాహ హక్కులు రావు. డీ వేలుస్వామి వర్సెస్ డీ పాట్చాయ్‌అమ్మల్ (2010) కేసులో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ను డొమెస్టిక్ రిలేషన్‌షిప్గా గుర్తించి, డీవీ యాక్ట్ కింద రక్షణ ఇవ్వవచ్చని తీర్పు వచ్చింది. ప్రస్తుతం ఏ రాష్ట్రంలోనూ లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ను నిషేధించే చట్టం లేదు. కానీ కొన్ని రాష్ట్రాలు రిజిస్ట్రేషన్ ప్రతిపాదిస్తున్నాయి. ఉత్తరాఖండ్ (2024): లివ్-ఇన్ జంటలు 30 రోజుల్లోపు రిజిస్టర్ చేసుకోవాలి. లేకపోతే జరిమానా/జైలు విధిస్తారు.

### సహజీవనం చేయాలంటే..

1. ఇద్దరూ పెద్దవాళ్ళు (18ం సంవత్సరాలు) అయి ఉండాలి.
2. ఇద్దరూ ఒంటరిగా (సింగిల్) ఉండాలి (ఇద్దరిలో ఒకరైనా వివాహం చేసుకుని ఉంటే, అది బిగమీగా పరిగణించబడుతుంది)
3. ఇద్దరూ స్వచ్ఛందంగా కలిసి జీవిస్తున్నారని నిరూపించాలి.
4. వివాహ ఉద్దేశం లేకపోయినా, కలిసి జీవించడం, ఆర్థిక బాధ్యతలు పంచుకోవడం, సమాజంలో భార్య-భర్తలుగా ప్రవర్తించడం వంటివి సాక్ష్యంగా తీసుకుంటారు.

### మహిళలకు రక్షణ - డీవీ యాక్ట్ 2005

- ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఫ్రమ్ డొమెస్టిక్ వయోలెన్స్ యాక్ట్ కింద:
- లివ్-ఇన్ భాగస్వామిని "డొమెస్టిక్ రిలేషన్‌షిప్"లో ఉన్నవారిగా గుర్తిస్తారు.
- మహిళకు హింస, ఆర్థిక దోపిడీ, గృహ హింస నుంచి రక్షణ ఉంది.
- నిర్వహణ (మెయింటెనెన్స్) డబ్బు కోరవచ్చు (కానీ వివాహిత భార్య అంత హక్కు ఉండదు).
- నివాస హక్కు (ఇంటి హక్కు) కూడా క్లెయిమ్ చేయవచ్చు (ఆస్తి హక్కు కాదు).
- భాగస్వామి ఇంటిని వదిలేసి వెళ్తే, మహిళ డీవీ కోర్టులో కేసు వేసి తాత్కాలిక నివాసం, నిర్వహణ పొందవచ్చు.

### పిల్లలకు ఉండే హక్కులు

- లివ్-ఇన్‌లో పుట్టిన పిల్లలు చట్టబద్ధమైన పిల్లలే (లెజిటిమేట్ చిల్డ్రన్).
- తండ్రి నుంచి నిర్వహణ, వారసత్వ హక్కు ఉంది
- తండ్రి చనిపోతే, పిల్లలకు సంపత్తిలో వాటా ఉంటుంది (కానీ తల్లికి భార్యగా వాటా ఉండదు).

### ఆస్తి, వారసత్వం

- భాగస్వామికి ఆస్తి హక్కు లేదు (వివాహిత భార్యలాగా).
- సంయుక్త ఆస్తి (ఇద్దరూ కలిసి కొన్నది) అయితే, వాటా ఉంటుంది.
- వీలునామా ద్వారా ఆస్తి ఇవ్వవచ్చు.
- గిఫ్ట్ డీడ్ ద్వారా ఆస్తి బదిలీ చేయవచ్చు.

# పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు హక్కులు

భారత రాజ్యాంగం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) ప్రకారం ప్రజల హక్కులను రక్షించడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది. పోలీస్ స్టేషన్లు నేరాల నిరోధకం, దర్యాప్తు, ప్రజా భద్రతకు ప్రాథమిక కేంద్రాలు. అయితే, ప్రజలు పోలీసులతో ఎదుర్కొన్నప్పుడు కొన్ని ముఖ్య హక్కులు ఉన్నాయి. తెలంగాణ పోలీస్ శాఖలో ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, వాంచితులకు సేవలు (షీ-టీమ్, వన్-స్టాప్ సెంటర్లు) ఉన్నాయి.

- ఫిర్యాదు దాఖలు చేయడం (ఎఫ్ఐఆర్): ఏదైనా నేరం (అబాయింట్, హత్య, దొంగతనం మొ.) గుర్తించినప్పుడు వెంటనే ఎఫ్ఐఆర్ దాఖలు చేయించుకోవాలి. తిరస్కరించకూడదు. డయల్ 100 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.
- అరెస్టుకు కారణం: అరెస్టు చేస్తున్నప్పుడు కారణాలు తెలియజేయాలి. మహిళల అరెస్టు సూర్యాస్తమయానికి ముందు మాత్రమే (సెక్షన్ 46).
- విచారణకు సమ్మతి: అరెస్టు తర్వాత 24 గంటల్లో మ్యాజిస్ట్రేట్ ముందు హాజరు. విచారణకు సమ్మతి లేకుండా బలవంతం చేయకూడదు.
- లాయర్‌ను కలవడం: అరెస్టు తర్వాత వకీలును కలవడం, సంప్రదించడం ప్రజల హక్కు.
- కుటుంబ సభ్యులకు సమాచారం: పోలీసులు ఎవరినైనా అరెస్టు చేశాక వెంటనే కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు తెలియజేయాలి.
- బెయిల్ హక్కు: బెయిలబుల్ అపరాధాల్లో వెంటనే బెయిల్ ఇవ్వొచ్చు. అన్‌బెయిలబుల్‌లో మ్యాజిస్ట్రేట్ నిర్ణయం ఉంటుంది.






## పోలీసులకు కొట్టే అధికారం ఉంటుందా?

**అనుమానితులు,** నిందితులను అరెస్టు చేశాక వారిని కొట్టే అధికారం పోలీసులకు ఉంటుందా? వారికి ఉండే పరిమితులు ఏంటి? భారత చట్టాలు ఏం చెప్తున్నాయి? అంటే.. అరెస్టు చేశాక పోలీసులకు ప్రజలను కొట్టే అధికారం లేదు. ఒకవేళ మిమ్మల్ని పోలీసులు కొడితే పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 29 ప్రకారం.. ఆ పోలీస్ అధికారికి 3 నెలల జైలు శిక్ష లేదా జరిమానా లేదా జరిమానాతో పాటు శిక్ష వేయొచ్చు. భారత చట్టాల ప్రకారం.. ఒక వ్యక్తిని అరెస్టు చేసిన తర్వాత ఆ వ్యక్తి పూర్తి బాధ్యత ఆ పోలీస్ అధికారిదే. అందుకే అరెస్టు చేసే సమయంలోనే మెమో ఆఫ్ అరెస్ట్ రాయించాలి. పోలీస్ అధికారి మెమో ఆఫ్ అరెస్ట్ కచ్చితంగా రాయాలి. ఎలా అంటే.. 'నేను ఫలానా పోలీస్ అధికారిని. ఫలానా వ్యక్తిని ఫలానా నేరం కింద అరెస్టు చేస్తున్నా' అని అధికారి పేరు, అతని హోదా, తేదీ, స్థలం, ఏ స్టేషన్ పరిధిలో అరెస్టు చేస్తున్నారు, ఆ సమయంలో అరెస్టు అయ్యే వ్యక్తి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? స్వల్ప-తీవ్ర గాయాలున్నాయా? అతడి వద్ద ఉన్న వస్తువులు ఏంటి? అన్న వివరాలతో పేపర్‌పై రాయాలి. ఆ పేపర్‌పై అతడి బంధువులు లేదా శ్రేయోభిలాషులు, సమాజంలో మంచిపేరున్న వ్యక్తి సంతకం, అరెస్టు చేసే పోలీస్ సంతకం, అరెస్ట్ అయిన వ్యక్తి సంతకం కూడా కచ్చితంగా పేపర్‌పై ఉండాలి. దీన్నే మెమో ఆఫ్ అరెస్ట్ అంటారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని కచ్చితంగా 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ లేదా కోర్టులో ప్రవేశపెట్టాలి. ఏ పోలీస్ అధికారైనా మిమ్మల్ని స్టేషన్‌కు రమ్మని ఫోన్ చేసి అడిగితే.. 'సీఆర్పీసీ సెక్షన్ 169, 170, 50 ప్రకారం నోటీసులు సర్వ్ చేయాలని వినయంగా కోరుతున్నా' అని చెప్పండి. లేదా వారు ఫోన్ చేసిన మొబైల్ నంబర్‌కు మెసేజ్ చెయ్యండి. ఒకవేళ పోలీసులు ఆ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొన్న సందర్భాలు అనేకం. పలు సందర్భాల్లో పోలీసులు సస్పెన్షన్‌కు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.